

కబళిస్తున్న క్యాన్సర్



- ఉత్తరాంధ్ర పరిధిలో ఏటా 20వేల కొత్త కేసులు

తరగతి గదిలో దుర్వాసన

- 11 మంది విద్యార్థులకు అస్వస్థత
- పద్మనాభనగర్ జడ్పీ హైస్కూల్‌లో సంఘటన

8లో

ఉక్కుకు కొరవడిన రక్షణ



వ్యయం తగ్గింపు పేరుతో భద్రతా సిబ్బంది కుదింపు

- 438 మంది సీఐఎస్ఎఫ్ సిబ్బంది బదిలీ
- అవసరమైతే హోంగార్డులను నియమించుకుంటామంటున్న యాజమాన్యం
- రెండు నెలల క్రితం ఫైర్ వింగ్ ప్రైవేటీకరణకు ప్రకటన
- కార్మికుల ఆందోళన



స్టీల్‌ప్లాంటు మెయిన్‌గేటు వద్ద తనిఖీలు నిర్వహిస్తున్న సీఐఎస్ఎఫ్ సిబ్బంది (ఫైల్ ఫొటో)

(విశాఖపట్నం-ఆంధ్రజ్యోతి)

స్టీల్ ప్లాంటులో ఉత్పత్తి వ్యయాల తగ్గింపు పేరుతో సిబ్బందిని కుదిస్తున్నారు. స్వచ్ఛంద పదవీ విరమణ పథకం ప్రకటించగా ఎగ్జిక్యూటివ్‌లు, నాన్ ఎగ్జిక్యూటివ్‌లు కలిపి 1,594 మంది దరఖాస్తు చేసుకున్నారు. ఇప్పుడు సెంట్రల్ ఇండస్ట్రియల్ సెక్యూరిటీ ఫోర్స్ (సీఐఎస్ఎఫ్) నుంచి 438 మందిని హైదరాబాద్, చెన్నై, తదితర ప్రాంతాలకు బదిలీ చేసేశారు. వారి స్థానంలో ఎవరినీ నియమించరు. దీనికి 'డిప్లాయ్‌మెంట్ వ్యయం తగ్గింపు' అని పేరు పెట్టారు.

సీఐఎస్ఎఫ్ అనేది చాలా ప్రతిష్ఠాత్మకమైన రక్షణ వ్యవస్థ. పార్లమెంటు భవనానికి 3,600 మంది సీఐఎస్ఎఫ్ సిబ్బంది రక్షణ కల్పిస్తున్నారు. దేశంలోని 64 విమానాశ్రయాల్లో రక్షణ బాధ్యత కూడా సీఐఎస్ఎఫ్ సిబ్బందే చూస్తున్నారు. మైసూర్‌లో ముద్రించే కరెన్సీ నోట్లను వివిధ ప్రాంతాలకు తరలించే ప్రక్రియ కూడా వీరే చూస్తున్నారు. విశాఖపట్నం స్టీల్ ప్లాంటు కూడా ఆ స్థాయిలో రక్షణ కల్పించాల్సిన సంస్థగా భావించి 1983 ఆగస్టులో ఇక్కడ సీఐఎస్ఎఫ్ యూనిట్ ఏర్పాటుచేశారు. నాలుగు దశాబ్దాలు దాటిపోయింది. సుమారు 1,013 మంది సిబ్బంది 24 గంటలూ ఇక్కడ స్టీల్‌ప్లాంటుకు రక్షణ కల్పిస్తున్నారు.

స్టీల్ ప్లాంటుకు చెందిన రూ.3 లక్షల కోట్ల విలువైన భూములు, యంత్ర సామగ్రి, ఇంకా ముడి పదార్థాలు, ఉత్పత్తులను కంటికి రెప్పలా కాపాడుకుంటూ వస్తున్నారు. ఇప్పుడు వారు ఆర్థిక భారంగా మారారని పేర్కొంటూ దాదాపుగా సగం మంది (438)ని వివిధ ప్రాంతాలకు బదిలీ చేసేశారు. వీరిలో ఇన్‌స్పెక్టర్లు, సబ్ ఇన్‌స్పెక్టర్లు, హెడ్ కానిస్టేబుళ్లు, కానిస్టేబుళ్లు ఉన్నారు. చెన్నైలోని సీఐఎస్ఎఫ్ ఐజీ ఆదేశాల మేరకు ఈ ఉత్తర్వులు జారీ చేశామని, బదిలీ ఉత్తర్వులు అందుకున్నవారు తక్షణమే ఆయా ప్రాంతాలకు వెళ్లి విధుల్లో చేరాలని, వీటిపై ఎటువంటి అభ్యర్థనలు స్వీకరించేది లేదని ఇక్కడి అధికారులు స్పష్టంచేశారు. ఎవరికైనా ఏమైనా అభ్యంతరాలు ఉంటే...బదిలీ చేసిన ప్రాంతంలో విధుల్లో చేరాక..ఆ విషయమై సంప్రతింపులు చేయాలే తప్ప ఇక్కడ రిలీవ్ కాకుండా వేచి ఉండకూడదని హెచ్చరించారు. సగం మందిని తగ్గించడం వల్ల ఏమైనా ఇబ్బందులు వస్తే హోంగార్డులను పెడతామని ఉక్కు యాజమాన్య వర్గాలు చెబుతున్నాయి. ఇదిలావుండగా స్టీల్‌ప్లాంటులో తరచూ ప్రమాదాలు జరిగే

... మిగతా 6వ పేజీలో

ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికకు నోటిఫికేషన్

- తొలి రోజు నామినేషన్లు నిల్
- నేడు రఘువర్మ నామినేషన్
- 6న విజయగౌరి, 7న గాదె...

విశాఖపట్నం, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలకు రిటర్నింగ్ అధికారి, విశాఖపట్నం జిల్లా కలెక్టర్ ఎం.ఎన్.హరేంధిరప్రసాద్ సోమవారం నోటిఫికేషన్ విడుదల చేశారు. పదో తేదీ వరకూ నామినేషన్లు స్వీకరించనున్నారు. 27న పోలింగ్ నిర్వహిస్తారు. వచ్చే నెల మూడో తేదీన ఓట్ల లెక్కింపు ఉంటుంది. తొలిరోజైన సోమవారం ఒక్క నామినేషన్ కూడా దాఖలు కాలేదు. అయితే పది మంది నామినేషన్ పత్రాలను కలెక్టరేట్ నుంచి తీసుకున్నారు. సిట్టింగ్ ఎమ్మెల్సీ పాకలపాటి రఘువర్మ మంగళవారం నామినేషన్ దాఖలు చేయనున్నారు. జీవీఎంసీ ప్రధాన కార్యాలయం ఎదురుగా ఉన్న గాంధీ విగ్రహం వద్ద నుంచి కలెక్టరేట్ వరకూ ఊరేగింపుగా వెళ్లి నామినేషన్ సమర్పిస్తారని ఏపీటీఎఫ్ ప్రతినిధులు తెలిపారు. ఆరో తేదీన పీడీఎఫ్ మద్దతుతో కోరెడ్ల విజయగౌరి, ఏడో తేదీన పీఆర్‌టీయూ మద్దతుతో గాదె శ్రీనివాసులనాయుడు నామినేషన్లు దాఖలు చేస్తారు.

ఆర్టీసీలో వాట్సాప్ గవర్నెన్స్

- నేటి నుంచి సేవలు అమలు
- టికెట్ బుకింగ్, క్యాన్సిల్‌కు అవకాశం

ద్వారకా బస్‌స్టేషన్, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): ఆర్టీసీలో వాట్సాప్ గవర్నెన్స్ ప్రారంభం కానున్నది రాష్ట్ర ప్రభుత్వం తీసుకువచ్చిన పౌర సహాయక సేవ మనమిత్ర అమలులో భాగంగా ఆర్టీసీ విశాఖపట్నం రీజియన్ మంగళవారం నుంచి ఈ సేవలు అందిస్తోంది. ఆర్టీసీ

... మిగతా 6వ పేజీలో

కేజీహెచ్ కార్డియాలజీ విభాగం బయట వేచివున్న రోగులు



గుండె పరీక్షకు గంటల నిరీక్షణ

కేజీహెచ్ కార్డియాలజీ విభాగంలో రోగుల పడిగాపులు

- 2డీ ఎకో వంటివి రోజుకు వంద మందికే నిర్వహణ
- టోకెన్ల కోసం తెల్లవారుజాము నుంచి క్యూ
- మూలకు చేరిన ట్రెడ్ మిల్ టెస్ట్ పరికరం
- బయటే చేయించుకోవాల్సిన దుస్థితి



వైద్య పరీక్షలు నిర్వహించే గది వద్ద రోగుల పడిగాపులు

విశాఖపట్నం, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి):

కేజీహెచ్‌లో అత్యంత కీలకమైన కార్డియాలజీ విభాగంలో వైద్య సేవల కోసం రోగులు గంటల తరబడి పడిగాపులు పడాల్సి వస్తోంది. 2డీ ఎకో, ట్రెడ్ మిల్ వంటి పరీక్షలు చేయించుకోవాలంటే మరింత కష్టంగా మారింది. సోమవారం 'ఆంధ్రజ్యోతి' ప్రతినిధి కార్డియాలజీ విభాగాన్ని పరిశీలించి నప్పుడు వైద్య పరీక్షలు నిర్వహించే చిన్న గది బయట సిబ్బంది పిలుపు కోసం పదుల సంఖ్యలో రోగులు బయట ఎదురుచూస్తూ కనిపించారు.

అనేక ప్రాంతాలు నుంచి రోగులు..

కార్డియాలజీ ఓపీ విభాగానికి ప్రతిరోజూ 250 మంది వస్తారు. అత్యవసర పరిస్థితుల్లో

... మిగతా 6వ పేజీలో

రైతుబజార్లలో సబ్జీ కూలర్ల మార్కెటింగ్

- కొనాల్సిందేనంటూ అధికారుల ఒత్తిడి
- తమకు కేటాయించిన చిన్నపాటి స్టాల్‌లో అంతటి భారీ కూలర్ ఏర్పాటుచేయడం సాధ్యం కాదని రైతుల వాదన
- అధికారుల అనాలోచిత నిర్ణయాలతో ఇక్కట్లు



రైతులకు అందిస్తున్న సబ్జీ కూలర్

(విశాఖపట్నం-ఆంధ్రజ్యోతి)

రైతుబజార్లలో వ్యవసాయ మార్కెటింగ్ శాఖాధికారులు విచిత్రమైన ప్రయోగాలు చేస్తున్నారు. నిల్చోవడానికే చోటు లేని విధంగా మారిపోయిన బజార్లలో వంద కిలోలు, యాభై కిలోల సామర్థ్యం కలిగిన కూలర్లు పెట్టుకోవాలని రైతులను వేధిస్తున్నారు. విజయవాడలోని రైతుబజార్ల సీఈఓ అన్ని జిల్లాలకు 'సబ్జీ కూలర్లు' పంపించారు. వాటిని రైతులతో కొనిపించాలని ఒత్తిడి పెడుతున్నారు. దాంతో ఇక్కడి వ్యవసాయ మార్కెటింగ్ శాఖాధికారులు రైతు బజార్లకు వెళ్లి ప్రయోగాత్మకంగా ఉపయోగించండి...అంటూ వాటిని రైతులకు అంటగడుతున్నారు.

ఉత్తర భారతదేశంలో కూరగాయలు పాడైపోకుండా కొందరు 'సబ్జీ కూలర్లు' తయారుచేశారు. వాటిలో కూరగాయలు నిల్వ చేస్తే వారం రోజుల వరకూ పాడవ్వవు. దీనికి విద్యుత్ అవసరం లేదు. ఈ కూలర్‌లో తగిన మోతాదులో నీరు పోస్తే కూరగాయలు నిల్వ చేసుకోవడానికి ఉపయోగపడుతుంది. ఎటువంటి తడి లేకుండా అరటి గెలలు, మామిడికాయలు పెడితే రెండు, మూడు రోజుల్లో పక్వానికి వస్తాయి. ఆ విధంగా కూడా ఉపయోగించుకోవచ్చు. ఇది ప్రయోజనకరమైనదే కానీ ఇక్కడ మన రైతుబజార్లకు పెద్దగా అవసరం లేదు. అయితే కూరగాయలు మిగిలిపోయినప్పుడు వాటిని ఇందులో పెట్టుకొని ఆ తరువాత

... మిగతా 6వ పేజీలో

బడ్జెట్‌లో దక్షిణ కోస్తా రైల్వే జోన్‌కు నిధులు

- వివరాలు ఇంకా రావలసి ఉంది
- వాల్తేరు డివిజన్‌లో పది స్టేషన్ల అభివృద్ధి
- విశాఖ స్టేషన్ అభివృద్ధికి మళ్లీ టెండర్లు
- త్వరలో మరిన్ని వందేభారత్ రైళ్లు
- కొత్తగా నమో భారత్ రైళ్లు
- ఇంటర్ సిటీలుగా నిర్వహణ
- డీఆర్ఎం మనోజ్‌కుమార్ సాహూ





డీఆర్ఎం మనోజ్ కుమార్ సాహూ

విశాఖపట్నం, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): రైల్వే బడ్జెట్‌లో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి రూ.9,417 కోట్లు కేటాయించారని వాల్తేరు డివిజనల్ రైల్వే మేనేజర్ మనోజ్‌కుమార్ సాహూ వెల్లడించారు. డీఆర్ఎం కార్యాలయంలో సోమవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. అంతకు ముందు రైల్వే మంత్రి అశ్వినీ వైష్ణవ్ రెండు తెలుగు రాష్ట్రాల రైల్వే డివిజన్ అధికారులతో వర్చువల్‌గా వీడియో సమావేశంలో మాట్లాడారు. రెండు రాష్ట్రాలకు కేటాయించిన నిధులు, చేపట్టాల్సిన పనులు గురించి వివరించారు. అనంతరం విలేకరులతో డీఆర్ఎం సాహూ మాట్లాడుతూ, విశాఖలో కొత్తగా ఏర్పాటుచేయబోయే దక్షిణ కోస్తా రైల్వే జోన్‌కు బడ్జెట్‌లో తప్పకుండా నిధులు వస్తాయని, ఆ వివరాలు పింక్ బుక్‌లో ఉంటాయని, అది ఇంకా వాల్తేరు డివిజన్‌కు అందలేదన్నారు. వాల్తేరు డివిజన్ పరిధిలో రూ.800 కోట్ల నిధులతో అమృత్ భారత్ కింద పది రైల్వే స్టేషన్లను అభివృద్ధి చేస్తున్నామన్నారు. అందులో దువ్వాడ, సింహాచలం, కొత్తవలస, చీపురుపల్లి, విజయనగరం, శ్రీకాకుళం, నౌపడా, బొబ్బిలి, అరకు స్టేషన్లు ఉన్నాయన్నారు. విశాఖపట్నం రైల్వే స్టేషన్ అభివృద్ధి గురించి మాట్లాడుతూ, గతంలో పనులు దక్కించుకున్న కాంట్రాక్టర్ వెనక్కి వెళ్లిపోవడం వల్ల మళ్లీ టెండర్లు పిలిచామని, త్వరలో ఇక్కడ కూడా పనులు ప్రారంభమవుతాయన్నారు. వాల్తేరు

... మిగతా 6వ పేజీలో

అసాంఘిక శక్తులపై ఉక్కు పాదం

రౌడీషీటర్లు, గంజాయి స్మగ్లర్లపై పీడీ యాక్ట్

- మూడు నెలల వ్యవధిలో ఆరు క్రిమినల్ కేసుల్లో ఇన్‌వాల్వ్ అయిన ఆరుగురిపై యాక్ట్
- గంజాయి కేసుల్లో ఉన్న మరో ఏడుగురిపై చర్యకు ప్రభుత్వానికి పోలీస్ కమిషనర్ సిఫారసు



(విశాఖపట్నం-ఆంధ్రజ్యోతి)

నగరంలో భూకబ్జాలకు పాల్పడుతున్న, తరచూ నేరాల్లో తలదూర్చుతున్న వారితోపాటు రౌడీషీటర్లు, గంజాయి రవాణాదారులు, విక్రయదారులపై ఉక్కుపాదం మోపాలని పోలీస్ కమిషనర్ శంఖబ్రతబాగ్చి నిర్ణయించారు. అందులో భాగంగా ఆరుగురిపై ఆదివారం పీడీ యాక్ట్ మోపారు. గంజాయి కేసుల్లో నేరస్థులుగా గుర్తించిన మరో ఏడుగురిపై పీఐటీ ఎన్‌డీపీఎస్ యాక్ట్ కింద పీడీ యాక్ట్ అమలు చేయాలని రాష్ట్ర ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపించారు.

నగరంలో శాంతి భద్రతల పరిరక్షణ కోసం పోలీసులు అనేక చర్యలు తీసుకుంటున్నారు. రౌడీషీటర్లు గొడవలు, సెటిల్‌మెంట్‌లు, భూకబ్జాల్లో తలదూర్చకుండా నిరంతరం వారి కదలికలపై నిఘా పెడుతున్నారు. ప్రతి ఆదివారం స్టేషన్ల వారీగా రౌడీషీటర్లకు కౌన్సెలింగ్ నిర్వహిస్తున్నారు. అయినప్పటికీ పోలీసులు కళ్లుగప్పి రౌడీషీటర్లు ఏదో ఒకచోట దాడులు, హత్యలతో అలజడి సృష్టిస్తూనే ఉన్నారు. కొన్నిసార్లు మద్యం మత్తులో విచక్షణ కోల్పోయి ఇరుగుపొరుగు వారిపై దాడులకు పాల్పడుతున్నారు. స్థానికుల సమాచారం మేరకు అక్కడకు చేరుకుని నియంత్రించేందుకు యత్నించిన పోలీసులపైనా దాడి చేస్తున్నారు. కొద్దిరోజుల కిందట ఎంవీపీ పోలీస్ స్టేషన్ పరిధిలో ఒక రౌడీషీటర్ తన పక్కింటి వారితో రాత్రివేళ గొడవ పడుతున్నట్టు డయల్ 100కి సమాచారం అందడంతో గస్తీలో ఉన్న కానిస్టేబుల్ అక్కడకు వెళ్లారు. మద్యం మత్తులో ఉన్న రౌడీషీటర్ సదరు కానిస్టేబుల్‌పై పిడిగుద్దులతో విరుచుకుపడ్డాడు. దాంతో కానిస్టేబుల్ అక్కడి నుంచి పారిపోవాల్సి వచ్చింది. అలాగే పెదవాల్తేరు జంక్షన్‌లో రాత్రి గస్తీ నిర్వహిస్తున్న హెడ్‌కానిస్టేబుల్‌పై మరొక రౌడీషీటర్ దాడి చేశాడు. ఈ నేపథ్యంలో శాంతి భద్రతలకు విఘాతం కలిగించే వారిపై కఠిన చర్యలు తీసుకోవాల్సిందేనని భావించిన సీపీ శంఖబ్రతబాగ్చి నగరంలో ప్రమాదకరంగా వ్యవహరిస్తున్న వారిని గుర్తించాలని పోలీస్ అధికారులను ఆదేశించారు. మూడు నెలల కాలంలో వరుసగా ఆరు క్రిమినల్ కేసుల్లో భాగస్వాములైన వారి జాబితాను తయారుచేసి పీడీ యాక్ట్ అమలుకు ప్రతిపాదనలు పంపాలని అన్ని సబ్ డివిజన్‌ల ఏసీపీలకు సూచించారు. ఈ మేరకు

... మిగతా 6వ పేజీలో

టీడీఆర్ హబ్‌పై ప్రభుత్వం దృష్టి

- పీహెచ్‌డీ ప్రవేశాలపై ఆరా
- అడ్మిషన్స్ వివరాలు సమర్పించాల్సిందిగా ఆదేశం
- గత వీసీ ప్రసాదరెడ్డి హయాంలో ప్రారంభం
- ఎగ్జిక్యూటివ్ కోటాలో అడ్మిషన్స్‌పై అనేక ఆరోపణలు
- విభాగాలతో సంబంధం లేకుండానే వ్యవహారం
- అయినప్పటికీ ప్రీ పీహెచ్‌డీ పరీక్షలు, వైవా నిర్వహించేందుకు అనుమతి ఇచ్చిన ప్రస్తుత అధికారులు
- అంతా నిబంధనలకు విరుద్ధంగా జరిగిందంటూ ప్రభుత్వానికి ఫిర్యాదులు
- ఈ నేపథ్యంలో మొత్తం ప్రక్రియను నిలిపివేయాలంటూ ప్రభుత్వం, ఉన్నత విద్యాశాఖ ఉత్తర్వులు

(విశాఖపట్నం-ఆంధ్రజ్యోతి)

ఆంధ్ర విశ్వవిద్యాలయంలో గత వైస్ చాన్సలర్ ప్రసాదరెడ్డి హయాంలో ఏర్పాటు చేసిన ట్రాన్స్ డిసిప్లినరీ రీసెర్చ్ (టీడీఆర్) హబ్‌పై ఎట్టకేలకు రాష్ట్ర ప్రభుత్వం దృష్టిసారించింది. వర్సిటీలోని విభాగాలతో సంబంధం లేకుండా వందలాది మందికి టీడీఆర్ హబ్‌లో అడ్డగోలుగా పీహెచ్‌డీ ప్రవేశాలు కల్పించారంటూ అప్పట్లో పెద్దఎత్తున విమర్శలు వచ్చాయి. ఇందులో అప్పటి ఉన్నతాధికారికి సన్నిహితుడొకరు కీలకంగా వ్యవహరించారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం వచ్చిన తరువాత టీడీఆర్ హబ్ ప్రవేశాలపై ప్రభుత్వ పెద్దలకు ఫిర్యాదులు అందాయి. ఈ నేపథ్యంలో ఏయూ ఇన్‌చార్జి వీసీ ఒక కమిటీని ఏర్పాటుచేశారు. ఆ కమిటీ నివేదికను ఉన్నతాధికారులకు సమర్పించింది. ఆ మేరకు ఆయా విభాగాల ఆధ్వర్యంలోనే ఈ ప్రక్రియను నిర్వహించేలా ఆదేశాలు జారీ చేశారు. అయితే, టీడీఆర్ హబ్‌లో ప్రవేశాలపైనే అనేక అనుమానాలు ఉన్నాయని, అటువంటి ప్రవేశాలను అధికారికం చేసేలా ఉన్నతాధికారులు ఆదేశాలు జారీచేయడమేమిటని పలువురు ప్రిన్సిపాల్స్ తీవ్రంగా వ్యతిరేకించారు. ప్రీ పీహెచ్‌డీ పరీక్షలు,

... మిగతా 6వ పేజీలో



టీడీఆర్ హబ్ భవనం



స్వామివారికి గరుడ సేవ

అప్పన్నకు వైభవంగా ఆర్జిత సేవలు

సింహాచలం, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి) : వరాహలక్ష్మీనృసింహస్వామికి పలు ఆర్జిత సేవలను సోమవారం వైభవంగా నిర్వహించారు. వేకువజామున సుప్రభాతసేవతో స్వామివారిని మేల్కొలిపి ప్రభాతారాధనలు పూర్తిచేశారు. ఉత్సవమూర్తి గోవిందరాజస్వామిని ఉభయ దేవేరులతో శోభాయమానంగా అలంకరించి, ప్రత్యేక వేదికపై అధిష్ఠింపజేశారు. భక్తుల గోత్రనామాలతో సంకల్పించి, తొలుత సహస్రనామ తులసీ దళార్చన, తరువాత రజిత వాహనంపై గోవిందరాజస్వామిని ఉంచి గరుడసేవ, అనంతరం పాంచరాత్రాగమశాస్త్ర విధానంలో నిత్య కల్యాణం

జాతీయ కరాటే పోటీల్లో భీమిలి విద్యార్థుల ప్రతిభ

భీమునిపట్నం, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి) : విశాఖ నగరంలోని రాజీవ్‌గాంధీ ఇండోర్ స్టేడియంలో ఈనెల 1న జరిగిన 8వ జాతీయ స్థాయి కరాటే పోటీల్లో ది సన్ స్కూల్ విద్యార్థులు పలు పతకాలు సాధించారు.పాఠశాలలో 3వ తరగతి చదువుతున్న మాస్టర్ యు వన్ (విద్యార్థి పేరు), మాస్టర్ పూర్ణ చంద్రశేఖర్ బంగారు పతకాలు పొందగా, 5వ తరగతి విద్యార్థిని యశిక బాలికల విభాగంలో వెండి పతకం సాధించింది. విజేతలను పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో స్కూల్ డైరెక్టర్ కె. శ్రీనివాసరావు సోమవారం అభినందించారు.

శిల్పారామంలో కానరాని పర్యాటక వారోత్సవాలు

మధురవాడ, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి) : శిల్పారామంలో గతంలో మాదిరి పర్యాటక వారోత్సవాలు నిర్వహించాలని స్థానికులు కోరుతున్నారు. పదేళ్ల కిందట వరకు ప్రతి ఏడాది శిల్పారామంలో పర్యాటక శాఖ ఆధ్వర్యంలో వారోత్సవాలు నిర్వహించేవారు.వారం రోజుల పాటు కళాకారులు పలు కళారూపాలను ప్రదర్శించేవారు.తూర్పు గోదావరి జిల్లా నుంచి గరగలు, శ్రీకాకుళం నుంచి తప్పెట గుళ్ళు, కృష్ణా నుంచి డప్పు కళాకారులు, ఉమ్మడి విశాఖ నుంచి కోలాటం తదితర కళా బృందాలు ప్రదర్శనలు ఇచ్చేవారు. ఇవి పర్యాటకులను ఎంతగానో ఆకట్టుకునేవి. వైసీపీ అధికారంలోకి వచ్చిన తరువాత వారోత్సవాలను నిర్వహించలేదు. కూటమి ప్రభుత్వం తిరిగి వాటిని పునరుద్ధరించాలని స్థానిక కళాకారులు కోరుతున్నారు.

'బీఆర్‌టీఎస్ బాధితులంతా టీడీఆర్‌కు అర్హులే'

సింహాచలం, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి) : జీవీఎంసీ 98వ వార్డులోని సింహాచలం కొండ దిగువ తొలిపావంచా నుంచి పాత అడివివరం కూడలి వరకు చేపట్టిన బీఆర్‌టీఎస్ సింహాచలం కారిడార్ ఫేజ్-2లో టీడీఆర్‌లు పొందేందుకు బాధితులంతా అర్హులే అని కార్పొరేటర్ పివి నరసింహం స్పష్టం చేశారు. జనసేన కార్పొరేటర్ పీతల మూర్తియాదవ్ నగరంలో అనర్హులకు టీడీఆర్ జారీ చేశారని చేసిన వ్యాఖ్యలను ఆయన ఖండించారు. ఈమేరకు సోమవారం ఇక్కడి విలేకరులతో మాట్లాడారు. బీఆర్‌టీఎస్ సింహాచలం కారిడార్ నిర్మాణానికి ముందే కమిషనర్ ప్రత్యేక కమిటీ నియమించి, అర్హులను గుర్తించిన తరువాతే నష్టపరిహారం కాని టీడీఆర్‌లు కాని జారీ చేశారని చెప్పారు. బాధితులంతా తరతరాలుగా ఇక్కడ నివసిస్తున్న వారేనని, వలస వచ్చిన వారు కాదని తెలిపారు. నిరాధారమైన ఆరోపణలు చేయడం సరికాదని, ఇటువంటి ప్రకటనల వల్ల బాధితుల్లో ఆందోళన వ్యక్తమవుతోందన్నారు.

నేలకొరిగిన సీసీ కెమెరాల స్తంభం


భీమునిపట్నం, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి) : భీమిలి బీచ్ రోడ్ తిమ్మాపురం జంక్షన్‌లో పోలీసు శాఖ ఏర్పాటు చేసిన సీసీ కెమెరాల స్తంభం గుర్తు తెలియని వాహనం ఢీకొనడంతో సోమవారం నేలకొరిగింది.ఆ సమయంలో రోడ్‌లో వాహనాల రాకపోకలు జరగకపోవడంతో ప్రమాదం తప్పింది. ఈ విషయమై సీఐ బి. సుధాకర్‌తో మాట్లాడగా, క్రేన్ ఢీకొనడంతో ప్రమాదం జరిగిందని స్థానికుల ద్వారా తెలిసిందన్నారు. రోడ్‌లో ఉన్న సీసీ పుటేజీలను పరిశీలిస్తున్నామని చెప్పారు.

ప్రజల కష్టాలు తీరేదెన్నడు..?

- మధురవాడ పరిసర ప్రాంతాల్లో ఏటా వేసవిలో తాగునీటి ఎద్దడి
- అందుబాటులోకి రాని తుమ్మిగెడ్డ జలాశయం నీరు
- పదేళ్ల కిందట ప్రతిపాదనలు చేసిన అప్పటి మంత్రి గంటా
- అనంతరం పట్టించుకోని వైసీపీ
- కూటమిపై స్థానికుల ఆశలు



వికలాంగుల కాలనీలో తాగునీటి సమస్య వల్ల డ్రమ్ములతో నీరు నిల్వ చేసుకుంటున్న మహిళలు



తుమ్మిరిగెడ్డ జలాశయం

కొమ్మాది, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి) : మధురవాడ పరిసర ప్రాంత ప్రజలు ఏటా వేసవిలో తాగునీటి సమస్య ఎదుర్కొంటున్నారు. ఏళ్ల తరబడి ఈ సమస్య ఉన్నా.. పాలకులు, అధికారులు పట్టించుకోవడం లేదు. మార్చి, ఏప్రిల్ నెలల్లో కొన్ని వార్డుల్లో భూగర్భ జలాలు పూర్తిగా అడుగంటిపోవడం, జీవీఎంసీ తాగునీటి సరఫరా అంతంతమాత్రంగా ఉండడంతో ప్రజలు గుక్కెడు నీటికి అల్లాడిపోయే పరిస్థితి ఉంది. ఎండలు పూర్తిస్థాయిలో ముదరక ముందే పాలకులు, అధికారులు స్పందించి తాగునీటి ఎద్దడి నివారణకు చర్యలు తీసుకోవాల్సి ఉంది.

జీవీఎంసీ జోన్ - 2 కార్యాలయంలో పరిధిలోని 5, 6, 7 వార్డులు శరవేగంగా అభివృద్ధి చెందుతున్నాయి. ఇక్కడ వివిధ జిల్లాల నుంచి ఉపాధి, వ్యాపార అవసరాల నిమిత్తం వస్తున్న వేలాది మంది నివాసం ఉంటున్నారు. ఈ నేపథ్యంలో స్థానికుల తాగునీటి అవసరాలకు ఉపయోగపడేలా పీఎంపాలెం శివారులో ఉన్న తుమ్మిరిగెడ్డ జలాశయాన్ని తీర్చిదిద్దాల్సి ఉంది. జలాశయం నిత్యం నీటితో కళకళలాడుతోంది. వేసవిలో తాగునీటి ఎద్దడితో అల్లాడే మధురవాడ ప్రాంత ప్రజల దాహార్తి తీర్చడానికి 2014-19 మధ్య అప్పటి మంత్రి గంటా శ్రీనివాసరావు ప్రయత్నించారు. జలాశయాన్ని ఆధునికీకరించి ప్రజలకు పూర్తిస్థాయిలో తాగునీటి అవసరాలు తీర్చేందుకు ప్రతిపాదనలు తయారు చేయాలని అప్పటి అధికారులను ఆదేశించారు. జలాశయం కేంద్ర అటవీ శాఖ పరిధిలో ఉండడంతో అటవీ శాఖ, జల వనరుల శాఖ, పర్యావరణ శాఖల నుంచి అనుమతులు తీసుకోవాలి.ఈవిషయాన్ని అధికారులు మంత్రి దృష్టికి తీసుకువెళ్లగా అవసరమైన చర్యలు తీసుకోవాలని సూచించారు. తరువాత ప్రభుత్వం మారడంతో ఈ ప్రతిపాదన మరుగున పడింది. కూటమి ప్రభుత్వం అధికారంలో ఉండడం, గంటా మళ్లీ ఎమ్మెల్యేగా ఎన్నిక కావడంతో తుమ్మిరిగెడ్డ జలాశయాన్ని వినియోగంలోకి తీసుకువచ్చి ప్రజల దాహార్తి తీర్చాలని స్థానికులు కోరుతున్నారు.



అష్టలక్ష్మీ దేవాలయంలో జరిగిన పూజలో చిన్నారులతో తల్లిదండ్రులు



సింహాచలంలో పిల్లలతో సామూహిక అక్షరాభ్యాసాలు

అప్పన్న సన్నిధిలో సామూహిక అక్షరాభ్యాసాలు



ఆనందపురంలోని నీళ్లకుండీలు వద్ద వసంత పంచమి పూజలు

సింహాచలం, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి) : వసంత పంచమి పురస్కరించుకుని వరాహలక్ష్మీనృసింహస్వామి సన్నిధిలో చిన్నారులకు సోమవారం సామూహిక అక్షరాభ్యాసాలు నిర్వహించారు. ఆలయ ఆవరణలోని వ్రత మండపంలో తల్లిదండ్రులను చిన్నారులతో కూర్చోబెట్టి అర్చకులు సరస్వతీదేవికి ప్రత్యేక పూజలు జరిపారు. తరువాత పలకలపై అక్షరాలు రాసి పిల్లలతో దిద్దించారు. అలాగే సింహాచలం దేవస్థానం ఆధీనంలో నిర్వహిస్తున్న నాద, వేద,ఆగమ పాఠశాలలు, హైస్కూల్‌లోనూ సరస్వతీదేవి పూజలు నిర్వహించారు. వేద పాఠశాల ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ శ్రీకాంతాచార్యులు విద్యార్థులతో శాస్త్ర విధానంలో సరస్వతీదేవికి షోడశోపచారాల పూజలు జరిపించారు. ఈ కార్యక్రమంలో దేవస్థానం ఈఓ వేండ్ర త్రినాథరావు, ఏఈఓలు రమణమూర్తి, ఆనందకుమార్ పాల్గొన్నారు.కాగా విద్యార్థుల ఉపకార వేతనాలు, సర్టిఫికెట్ చెల్లుబాటు అంశాలను ఉపాధ్యాయులు ఈఓ దృష్టికి తీసుకువెళ్లగా పరిష్కరించేందుకు కృషి చేస్తానని ఆయన చెప్పారు. దేవస్థానం హైస్కూల్‌లో హెచ్‌ఎం భాను ఆధ్వర్యంలో సరస్వతీదేవి విగ్రహానికి పూలమాల వేసి, పూజలు చేశారు.

ఆనందపురం : మండలంలోని నీళ్లకుండీలు వద్ద ఉన్న శ్రీసాయి స్వామి వివేకానంద పాఠశాలలో వసంత పంచమి ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సరస్వతీదేవికి, భారత మాతకు పూజలు, యజ్ఞం నిర్వహించారు. అనంతరం చిన్నారులతో సరస్వతీ పూజ చేయించి, అక్షరాభ్యాసం చేశారు. కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ లెంక సురేశ్, పాఠశాల డైరెక్టర్లు కొట్రా శర్మ, చవితిన వీరుబాబు, యమరాణి పాల్గొన్నారు.

విశాలాక్షినగర్ : స్థానిక బీవీకే పాఠశాలలో హెచ్‌ఎం కేవీడీ మాధురి ఆధ్వర్యంలో 60 మంది చిన్నారులకు సామూహిక అక్షరాభ్యాసాలు నిర్వహించారు. ఈ సందర్భంగా సరస్వతీ హోమం నిర్వహించారు. కార్యక్రమంలో పాఠశాల చైర్మన్ జి. నాగేశ్వరరావు,ప్రబంధకారిణి వెంకటేశ్వర్లు, తదితరులు పాల్గొన్నారు.

కొమ్మాది : కొమ్మాది అష్టలక్ష్మీ దేవాలయంలో వసంత పంచమి ఘనంగా నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకుడు శ్రీధరస్వామి వేకువజామున సరస్వతీదేవికి హోమంనిర్వహించారు. అనంతరం చిన్నారులతో పూజ చేయించి, సామూహిక అక్షరాభ్యాసం జరిపారు. ఈ కార్యక్రమంలో ఆలయ ధర్మకర్తలు అన్నంరాజు సత్యనారాయణ, రమాదేవి తదితరులు పాల్గొన్నారు.

హిందీ పరీక్షల్లో పొట్నూరు విద్యార్థుల ప్రతిభ

పద్మనాభం, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి) : పొట్నూరు మండల పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాలకు చెందిన 10 మంది విద్యార్థులు హిందీ ప్రతిభ పరీక్షల్లో పతకాలు సాధించారు. దశమందం సేవా సదన్ ఆధ్వర్యంలో ఈ పరీక్షలు నిర్వహించారు.

రైతుబజార్లలో సబ్జీ కూలర్ల మార్కెటింగ్

... 5వ పేజీ తరువాయి

అమ్ముకోవచ్చునని చెబుతున్నారు.

● విశాఖపట్నం రైతుబజార్లలో రైతులు తెచ్చిన కూరగాయలు మిగిలిపోవడం, వాటిని మళ్లీ వెనక్కి గ్రామాలకు తీసుకువెళ్లడం చాలా అరుదు. ఏ రోజు కూరగాయలు ఆరోజే అమ్మేసుకుంటారు. ఇంకా త్వరగా అయిపోతున్నాయని, ఉదయం కొందరు రైతులతో, సాయంత్రం మరి కొందరు రైతులతో కూరగాయలు అమ్మిస్తున్నారు. ఈ నేపథ్యంలో ఇక్కడ ఈ కూలర్ల అవసరం లేదు.

● రైతుబజార్లలో రైతులకు కేటాయించే స్టాల్‌లో స్థలం చాలా తక్కువ. నాలుగు అడుగుల వెడల్పు, ఆరు అడుగుల పొడవు ఉండే స్థలం రైతుకు ఇస్తున్నారు. వారు తెచ్చిన కూరగాయలు పెట్టుకోవడానికే ఆ స్థలం సరిపోవడం లేదు. ఇప్పుడు ఆ స్థాల్‌లో ఈ సబ్జీ కూలర్లు పెట్టుకుంటే...మూడో వంతు స్థలం దానికే సరిపోతుంది. రైతు కూర్చొని కూరగాయలు అమ్మడానికి కూడా స్థలం ఉండదు. అంత ఇబ్బందికరమైనా పరిస్థితి ఉన్నా సరే అధికారులు కూలర్లు తీసుకోవాలని రైతులపై ఒత్తిడి పెడుతున్నారు. ఈ కూలర్లు వంద కిలోలు నిల్వ చేసుకునేది అయితే రూ.50 వేలు, 50 కిలోలు నిల్వ చేసుకునేది అయితే రూ25,400, 25 కిలోలు నిల్వ చేసుకునేది అయితే రూ.17,700 అవుతుందని అధికారులు చెబుతున్నారు. అంత పెద్ద మొత్తం పెట్టి కూలర్లు కొనలేమని, తమకు వాటిని నిల్వ చేసుకోవలసిన అవసరం లేదని చెబుతున్నా అధికారులు వినడం లేదు. ఒక్కో బజారుకు కనీసం పది అయినా కొనాలని చెబుతున్నారు. దీంతో అప్పో సప్పో చేసి వాటిని కొంటామని, అయితే అవి స్టాల్‌లో కాకుండా మూకుమ్మడిగా రైతుబజారులో ఒకేచోట పెట్టుకునేలా ఏర్పాట్లు చేయాలని రైతులు కోరుతున్నారు.

గీతం వీసీగా డాక్టర్ ఎరోల్ డిసౌజా



సాగర్‌నగర్, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి) : గీతం యూనివర్సిటీ నూతన వైస్ ఛాన్సలర్‌గా ఐఐఎం అహ్మదాబాద్ విశ్రాంత డైరెక్టర్ డాక్టర్ ఎరోల్ డిసౌజా సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఆర్థిక నిపుణుడు అయిన ఆయన ఆర్‌బీఐ, నేషనల్ హౌసింగ్ బ్యాంక్, భారత ప్రణాళికా సంఘం, నీతి ఆయోగ్, నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ పబ్లిక్ ఫైనాన్స్ అండ్ పాలసీలకు సలహాదారుడిగా వ్యవహరించారు. పారిస్‌లోని సైన్సెస్ పో విశ్వవిద్యాలయం ప్రొఫెసర్‌గా, సింగపూర్ నేషనల్ వర్సిటీ సీనియర్ ఫెలోగా, సిమ్లాలోని ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ స్టడీ విజిటింగ్ ప్రొఫెసర్‌గా, కొలంబియా విశ్వవిద్యాలయం విజిటింగ్ స్కాలర్‌గా సేవలందించారు. యూనివర్సిటీ గ్రాంట్స్ కమిషన్, ఇండియన్ కౌన్సిల్ ఆఫ్ సోషల్ సైన్స్ రీసెర్చి నిపుణుల కమిటీ సభ్యుడిగా కూడా ఉన్నారు.డిసౌజా నియామకం పట్ల గీతం సలహాదారు, రాష్ట్ర పబ్లిక్ సర్వీస్ కమిషన్ మాజీ చైర్మన్ ప్రొఫెసర్ గొల్లు సూర్యనారాయణ అభినందనలు తెలిపారు.

జోన్-2 జడ్సీకి కార్మికుల వినతి



వినతిపత్రం ఇస్తున్న దృశ్యం

కొమ్మాది, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి) : మున్సిపల్ కార్మికుల జీతాల నుంచి 2016 నుంచి 2020 వరకు వసూలు చేసిన ఆదాయ పన్ను వెనక్కి ఇవ్వాలని కోరుతూ జోన్-2 జడ్సీ ఫణిరామ్‌కు కార్మికులు సోమవారం వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా సీఐటీయూ నాయకులు మాట్లాడుతూ జీవీఎంసీ ప్రజారోగ్య విభాగంలో ఔట్ సోర్సింగ్ కార్మికులకు 2016లో ఎస్ఎల్ఎఫ్ ద్వారా జీతాలు ఇచ్చేవారని,అప్పట్లో ఐదేళ్ల ఆదాయపు పన్ను వసూలు చేశారని చెప్పారు. అన్నిచోట్లా వసూలు చేసిన పన్ను నగదు తిరిగి ఇచ్చారని, కాని జోన్-2 పరిధిలో చెల్లించలేదన్నారు. వెంటనే నగదు జమ చేయాలని కోరారు.

అసాంఘిక శక్తులపై ఉక్కుపాదం

... 5వ పేజీ తరువాయి

వడ్లపూడి సమీపంలోని అంబేడ్కర్ కాలనీకి చెందిన రావాడ జగదీష్ (22), రావాడ ఉదయ్‌భాస్కర్ (22), ఆర్‌అండ్‌బీ ప్రాంతానికి చెందిన ఈతలపాక రాజ్‌కుమార్ (22), వడ్లపూడి కణితి ఆర్‌హెచ్ కాలనీకి చెందిన కాండ్రేగుల లోక్‌నాథ్ వీరసాయిశ్రీనివాస్ (22), చినగదిలి సాయిబాబా ఆలయం సమీపంలో నివాసం ఉంటున్న నక్కా లోకేష్ (26), పీఎంపాలెం ఆర్‌హెచ్ కాలనీకి చెందిన కొలగాని పవన్ రాజ్‌కుమార్ (25)పై పీడీ యాక్ట్ (ప్రివెన్షన్ ఆఫ్ డిటెంక్షన్) అమలు చేయాలని కోరుతూ రాష్ట్ర ప్రభుత్వానికి సిఫారసు చేశారు. సీపీ సిఫార్సులను పరిశీలించిన ప్రత్యేక కమిటీ వారిపై పీడీ యాక్ట్ అమలు చేస్తూ ఆదివారం ఉత్తర్వులు జారీచేసింది. మరోవైపు నగరంలో ప్రతిరోజూ ఎక్కడో ఒకచోట గంజాయి స్మగ్లర్లు పట్టుబడుతూనే ఉన్నారు. గంజాయి రవాణా, విక్రయాలకు పాల్పడుతున్నవారిపై పీఐటీ ఎన్‌డీపీఎస్ యాక్ట్ కింద పీడీయాక్ట్ అమలుచేయాలని సీపీ నిర్ణయించారు. నగరానికి చెందిన ఏడుగురిపై పీడీ యాక్ట్ అమలు చేయాలని కోరుతూ రాష్ట్ర ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపించారు. ఒకటి, రెండు రోజుల్లో ప్రభుత్వం నుంచి ఉత్తర్వులు వెలువడే అవకాశం ఉంది. ఒకసారి పీడీ యాక్ట్ కింద జైలుకు వెళితే కనీసం ఆరు నెలలుపాటు జైలులోనే ఉండాల్సి ఉంటుంది. బెయిల్ పిటిషన్ వేయడానికి కూడా అవకాశం ఉండదు. ఆరు నెలలు గడిచిన తర్వాత మరో ఆరు నెలలు చొప్పున...ఇలా మూడేళ్ల వరకు పోలీసులు వారిని జైలులోనే ఉంచేందుకు అవకాశం ఉంటుంది. పీడీ యాక్ట్‌ను తొలగించాలంటే నిందితుడి తరఫున న్యాయవాది రాష్ట్రస్థాయిలోని ప్రత్యేక కమిటీకి దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుంది. నిందితుడు జైల్లో గడిపిన కాలంలో ప్రవర్తన మార్చుకున్నాడని, ఇకపై నేరాల జోలికి వెళ్లడని హామీ ఇచ్చేందుకు తగిన ఆధారాలను కమిటీకి అందజేయాల్సి ఉంటుంది. కమిటీ ఆయా ఆధారాల పట్ల సంతృప్తి చెందితేనే పీడీ యాక్ట్ తొలగింపునకు పరిశీలించాలంటూ రాష్ట్రప్రభుత్వానికి సిఫారసు చేసేందుకు వీలుంటుంది. కమిటీ సంతృప్తి చెందకపోతే మాత్రం జైల్లోనే నిందితుడు కాలం వెళ్లదీయాల్సి ఉంటుంది.

టీడీఆర్ హబ్‌పై ప్రభుత్వం దృష్టి

... 5వ పేజీ తరువాయి

వైవా నిర్వహణకు కొందరు అంగీకరించలేదు. అంతేకాకుండా ఉన్నతాధికారులు ఇచ్చిన ఆదేశాలపై రాష్ట్ర ప్రభుత్వానికి, ఉన్నత విద్యా శాఖకు ఫిర్యాదు చేశారు. ఈ క్రమంలో మొత్తం ప్రక్రియను నిలిపివేయాలని ఉన్నత విద్యాశాఖ ఆదేశించింది. టీడీఆర్ హబ్‌లో ఇప్పటివరకూ ఏం జరిగింది?, ప్రస్తుతం ఏం జరుగుతోంది?...అనే వివరాలు సమర్పించాల్సిందిగా ఆదేశించింది. దీంతో టీడీఆర్ హబ్‌లో ప్రవేశాలు పొందిన వారికి ఆయా విభాగాల ఆధ్వర్యంలో నిర్వహించాల్సిన ప్రీ పీహెచ్‌డీ పరీక్షలు, వైవాలను నిలిపివేసినట్టు అధికారులు ప్రకటించారు.

తొలి ఏడాదిలో 700 ప్రవేశాలు...

టీడీఆర్ హబ్‌ను 2022లో ఏర్పాటుచేశారు. అదే ఏడాది అంటే 2022-23 విద్యా సంవత్సరం నుంచి ప్రవేశాలు కల్పించారు. తొలి ఏడాది సుమారు వేయి మందికి ప్రవేశాలు కల్పించినట్టు చెబుతున్నారు. ఇందులో 681 మందికి ఏపీఆర్ సెట్ ద్వారా ప్రవేశాలు కల్పించగా, మిగిలినవారు ఎగ్జిక్యూటివ్ కోటాలో అవకాశం ఇచ్చినట్టు చెబుతున్నారు. ఆర్‌సెట్ ద్వారా కల్పించిన ప్రవేశాలపై అభ్యంతరాలు లేవు కానీ, ఎగ్జిక్యూటివ్ కోటాలో జరిగిన వాటిపై అనేక అనుమానాలు ఉన్నాయి.

గుండె పరీక్షకు గంటల నిరీక్షణ

... 5వ పేజీ తరువాయి

ఎవరైనా నేరుగా కార్డియాలజీ విభాగానికి వచ్చి చూపించుకునేందుకు అవకాశం ఉంది. ఓపీ, ఐపీ (ఇన్‌పేషెంట్) సేవల్లో పెద్దగా ఇబ్బందులు ఉండవు. కానీ, ఈ విభాగంలో చేసే పరీక్షల కోసం మాత్రం రోగులు గంటల తరబడి నిరీక్షించాల్సి వస్తోంది. సోమవారం 'ఆంధ్రజ్యోతి' ప్రతినిధి కార్డియాలజీ విభాగానికి వెళ్లేసరికి సుమారు 100 మందికిపైగా రోగులు, వారి సహాయకులు 2డీ ఎకో పరీక్ష నిర్వహించే గది వద్ద నిరీక్షిస్తూ కనిపించారు. సుమారు రెండు గంటల నుంచి ఉన్నామని, ఇప్పటికీ పరీక్ష చేయడానికి పిలవలేదని రామమ్మ అనే వృద్ధురాలు వాపోయింది.

టోకెన్ల నుంచి పరీక్ష వరకు..

కార్డియాలజీ విభాగం కింద ఒక గదిలో 2డీ, ట్రెడ్ మిల్ టెస్ట్ చేస్తారు. 2డీ ఎకో పరీక్ష చేయించుకోవాలనుకునే రోగులకు ముందుగా టోకెన్లు జారీచేస్తారు. ఇవి ఉదయం ఎనిమిది గంటలకు కార్డియాలజీ విభాగానికి చెందిన సిబ్బంది పంపిణీ చేస్తారు. ప్రతిరోజూ వంద మందికి ఇస్తారు. అయితే, ఈ టోకెన్ల కోసం ఆస్పత్రిలోని వివిధ విభాగాల్లో ఇన్‌పేషెంట్‌లుగా ఉంటూ వైద్య సేవలు పొందుతున్న రోగులు, వారి బంధువులు తెల్లవారుజామున ఐదు గంటల నుంచి క్యూలో ఉంటారు. ఇక ఓపీకి వచ్చే రోగులు రెండు, మూడుసార్లు తిరిగితే గానీ ఈ పరీక్ష చేయించుకోవడం సాధ్యం కాదు. ఇన్‌పేషెంట్లుగా ఉండేవారు కూడా ఉదయం 8 గంటల నుంచి అక్కడకు చేరుకుని వేచి చూస్తుంటారు.

చిన్న గదిలోనే పరీక్షలు

కార్డియాలజీ విభాగంలోని 2డీ ఎకో పరీక్షలు నిర్వహించే గది చిన్నగా ఉంటుంది. ఒక్కోసారి టోకెన్లు తీసుకున్న వారికి పరీక్షలు నిర్వహించని పరిస్థితి ఏర్పడుతుంది. మధ్యాహ్నం రెండు గంటల వరకు మాత్రమే ఈ పరీక్షలు చేస్తారు. ఆ సమయం దాటితే మరుసటిరోజు రావాల్సిందే. 2డీ ఎకో పరీక్ష శనివారం పరీక్ష కాలేదని, అందుకే మళ్లీ సోమవారం రావాల్సి వచ్చిందని రామేశ్వరరావు అనే వ్యక్తి పేర్కొన్నారు.

మూలకు చేరిన ట్రెడ్ మిల్ పరికరం..

గుండె పనితీరును పరీక్షించే వాటిల్లో ట్రెడ్‌మిల్ టెస్ట్ ఒకటి. అయితే, గడిచిన నాలుగు నెలలుగా ఈ విభాగంలో ఉన్న ఏకైక ట్రెడ్ మిల్ పరికరం మూలకు చేరింది. దీంతో రోగులకు ట్రెడ్ మిల్ టెస్ట్ చేసే పరిస్థితి లేకుండా పోయింది. ఈ పరీక్ష అవసరమైన రోగులు బయటకు వెళ్లి చేయించుకోవాల్సిన దుస్థితి ఏర్పడుతోంది. ఈ విభాగ వైద్యులు సమస్యను ఉన్నతాధికారులు దృష్టికి తీసుకెళ్లినా ప్రయోజనం లేకుండా పోయింది.

రోగుల సంఖ్యకు అనుగుణంగా...

కార్డియాలజీ విభాగానికి వస్తున్న రోగుల సంఖ్య పెరుగుతోంది. అయితే, అందుకు అనుగుణంగా ఇక్కడ వైద్య సేవలు అందించాలంటే కొన్ని కీలక నిర్ణయాలు తీసుకోవాల్సిన అవసరం ఉంది. ప్రస్తుతం ఈ విభాగం నడుస్తున్న భవనం అత్యంత పురాతనమైనది. నాడు-నేడులో భాగంగా ఈ భవనాన్ని కూల్చి కొత్తవి నిర్మిస్తారని భావించారు. అయితే, ఇప్పట్లో ఈ పనులు పూర్తయ్యే అవకాశం లేదు. కార్డియాలజీ విభాగానికి ప్రతినెలా మూడు వేల మంది వరకు ఓపీ సేవలకు వస్తుంటారు. రోగుల సంఖ్య పెరిగిన నేపథ్యంలో మెరుగైన వైద్య సేవలు అందించేందుకు అనుగుణంగా విశాలమైన భవనాన్ని కేటాయించాల్సి ఉంది.

గంటలు తరబడి నిరీక్షించడమే ఇబ్బందే

- అల్లు సింహాచలం, రోగి

మాది బొబ్బిలి. తీవ్రమైన అనారోగ్య సమస్యతో రాజేంద్రప్రసాద్ వార్డులో చేరాను. వైద్యులు 2డీ ఎకో పరీక్ష చేయించుకోవాలని చెప్పారు. ఈ పరీక్ష చేయించుకునేందుకు వస్తే ఇక్కడ పరిస్థితి దారుణంగా ఉంది. ఆక్సిజన్ సహాయంతో వచ్చాను. పరీక్ష తరువాత స్కానింగ్‌కు వెళ్లాలి. అక్కడ కూడా రోగులు తాకిడి అధికంగా ఉంది. తీవ్రమైన అనారోగ్య సమస్యలతో బాధపడే రోగులకు ఆయా వార్డుల్లోనే అవసరమైన పరీక్షలు చేయాలి.

రోగులకు ఇబ్బందులు లేకుండా సేవలు

- డాక్టర్ ఆదిలక్ష్మి, కార్డియాలజీ విభాగాధిపతి

రోగులకు ఇబ్బందులు లేకుండా సేవలు అందిస్తున్నాం. 2డీ ఎకో పరీక్ష ఎక్కువ మందికి చేయించాల్సి వస్తుండడంతో అక్కడ అధిక సంఖ్యలో కనిపిస్తున్నారు. ప్రతిరోజూ 120 మందికి పరీక్షలు చేస్తున్నాం. రెండు మెషిన్లు ఉన్నాయి. పిల్లలకు కూడా ప్రత్యేకంగా చేయిస్తున్నాం. ఎక్కువ మంది ఇన్‌పేషెంట్లు వస్తుంటారు. ఎవరికి ఇబ్బందులు లేకుండా పరీక్షలు నిర్వహించేందుకు యత్నిస్తున్నాం.

ఉక్కుకు కొరవడిన రక్షణ

... 5వ పేజీ తరువాయి

అవకాశం ఉన్నందున తక్షణ సహాయ చర్యల కోసం ఇక్కడ ఏకంగా ఫైర్ విభాగాన్నే నడుపుతున్నారు. ప్లాంటులో మూడు ఫైర్ స్టేషన్లు, వాటిలో 13 ఫైర్ ఇంజిన్లు (అగ్నిమాపక వాహనాలు), వాటిలో పనిచేయడానికి 282 మంది శాశ్వత సిబ్బంది ఉన్నారు. విశాలంగా విస్తరించిన ప్లాంటులో 2,744 ఫైర్ హైడ్రెంట్లు, 1,071 ఎక్స్‌టర్నల్ ఫైర్ హైడ్రెంట్లు, 86 మానిటరింగ్ కేంద్రాలు, 28 ఫైర్ ఫైటింగ్ పంప్ హౌస్‌లు ఉన్నాయి. ప్రమాదాలు సంభవించినప్పుడు ఒక్కోసారి మంటలను నీటితో కాకుండా ఫోమ్, రసాయనాలను ఉపయోగించి నియంత్రించాల్సి ఉంటుంది. దానికి తగిన ఏర్పాట్లు కూడా ఉన్నాయి. మంటలను అదుపు చేసే కార్బన్ డయాక్సైడ్ వాహనం, ఫోమ్‌తో కూడిన వాహనాలు ఉన్నాయి. ఇవి కాకుండా వివిధ ప్రాంతాల్లో 14 వేల ఫైర్ ఎక్సిటింగ్ విషర్లు ఏర్పాటు చేశారు. వీటిని ప్రత్యేక శిక్షణ పొందిన సిబ్బందితో గత నాలుగు దశాబ్దాలుగా నిర్వహిస్తూ వస్తున్నారు. స్టీల్‌ప్లాంటులోనే కాకుండా హెచ్‌పీసీఎల్, పోర్టు, ఫార్మా సిటీ వంటి పరిశ్రమల్లో భారీ ప్రమాదాలు జరిగినప్పుడు స్టీల్ ప్లాంటు ఫైర్ ఇంజన్లు వెళ్లి సహాయ సహకారాలు అందిస్తున్నాయి. అటువంటి ఫైర్ విభాగాన్ని కూడా ప్రైవేటుకు అప్పగించాలని స్టీల్‌ప్లాంటు యాజమాన్యం నిర్ణయించింది. తమ దగ్గర అన్ని రకాల ఫైర్ ఫైటింగ్ పరికరాలు ఉన్నాయని, వాటితో ఫైర్ స్టేషన్లు నడపడానికి ఆసక్తి కలిగిన సంస్థలు ముందుకురావాలని డిసెంబరు నెలాఖరులో ఆసక్తి వ్యక్తీకరణ ప్రకటన జారీచేసింది. దీనిపై అప్పుడే అభ్యంతరాలు వ్యక్తమయ్యాయి.

ఆస్తులు దోచుకోవడానికి కుట్ర

- అయోధ్యరామ్, కన్వీనర్, ఉక్కు పోరాట కమిటీ

స్టీల్‌ప్లాంటు ఆస్తులను దొడ్డిదారిన దోచుకోవడానికి పెద్దస్థాయిలో కుట్ర జరుగుతోంది. అందుకే సీఐఎస్ఎఫ్ సిబ్బందిని తగ్గించేశారు. వారైతే ప్రాణాలు పణంగా పెట్టి రక్షణ కల్పిస్తారు. అదే ప్రైవేటు సిబ్బంది అయితే డబ్బులకు లొంగిపోతారు. వారికి లంచాలు ఇచ్చి ప్లాంటులో విలువైనవన్నీ వాహనాల్లో బయటకు తరలించుకుపోవచ్చు. దీనిపై కేంద్ర హోం శాఖ విచారణ చేయాలని డిమాండ్ చేస్తున్నాము.

బడ్జెట్‌లో దక్షిణ కోస్తా రైల్వే జోన్‌కు నిధులు

... 5వ పేజీ తరువాయి

డివిజన్ పరిధిలో రైల్వే లైన్లను వంద శాతం ఎలక్ట్రిఫికేషన్ చేశామన్నారు.

కవచ్ శిక్షణ కోసం సిబ్బంది

వాల్తేరు డివిజన్ పరిధిలోను కవచ్ రక్షణ వ్యవస్థ ఏర్పాటు చేస్తున్నారని, దానికి అవసరమైన శిక్షణ కోసం సిబ్బందిని దశల వారీగా సికింద్రాబాద్ పంపుతున్నామని చెప్పారు. మొదటి బృందం శిక్షణకు వెళ్లిందన్నారు. ఈ వ్యవస్థ వల్ల రైళ్లు ఒక ట్రాక్‌పై వచ్చి ఒక దానితో మరొకటి ఢీకొనే అవకాశాలు ఉండవన్నారు.

దేశంలో వందే భారత్ రైళ్లకు అనూహ్యమైన స్పందన లభిస్తోందని, విశాఖలో మూడు మార్గాల్లో నాలుగు రైళ్లు నడుపుతున్నామని, సికింద్రాబాద్, భువనేశ్వర్ మార్గాల్లో ఆక్యుపెన్సీ 100 శాతం కంటే అధికంగా ఉందన్నారు. దుర్గ్ వైపు నడుపుతున్న రైలులో పార్వతీపురం, రాయగడ వరకు ఆదరణ బాగుందని, ఆ తరువాత కొంచెం తక్కువగా ఉన్నందున ఇటీవల ఆ రైలులో ఎనిమిది కోచ్‌లు తగ్గించి నడుపుతున్నామని వివరించారు. కొత్తగా మరో 200 వందే భారత్ రైళ్లు తయారవుతున్నాయని, అవి అందుబాటులోకి వస్తే ప్రజలు కోరుకుంటున్న విధంగా విశాఖపట్నం నుంచి తిరుపతికి స్లీపర్ వందేభారత్ వచ్చే అవకాశం ఉందన్నారు.

కొత్తగా నమో భారత్ రైళ్లు కూడా వస్తాయని, ఇవి ఇంటర్ సిటీ ఎక్స్‌ప్రెస్‌లుగా ఉంటాయని, 100 కి.మీ. దూరం ఉన్న సిటీల మధ్య నడుపుతారని, వీటిలో 16 కోచ్‌లు ఉంటాయని ఆయన చెప్పారు. విశాఖపట్నం నుంచి రాజమండ్రి, శ్రీకాకుళం, పార్వతీపురం, విజయనగరం, కాకినాడ వంటి ప్రాంతాలకు వీటిని నడుపుకునే అవకాశం ఉందన్నారు. విశాఖపట్నం-పలాస మధ్య రైల్వే ట్రాక్‌ను గంటకు 130 కి.మీ. వేగంతో రైళ్లు నడిపేలా తీర్చిదిద్దామని డీఆర్‌ఎం సాహూ వివరించారు. ఈ సందర్భంగా విలేకరులు రాయగడ డివిజన్, వాల్తేరు డివిజన్ సరిహద్దులు నిర్ణయించారా?...అని ప్రశ్నించగా, ఆ విషయాలన్నీ బడ్జెట్ పరిధిలోకి రావని, వాటిపై విధాన నిర్ణయాలు తీసుకోవలసి ఉందన్నారు.

పురుగుల భాషపై అధ్యయనం

సాగర్‌నగర్, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి) : భూమిపై శబ్దం ద్వారా సమాచారం చేరవేసుకునే జీవులు పురుగులు అని, దీన్ని పురుగుల శబ్ద శాస్త్రం (ఇన్సెక్ట్ అకౌస్టిక్స్) ద్వారా అధ్యయనం చేసినట్టు బెంగళూరులోని ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ సైన్స్ సెంటర్ ఫర్ ఎకోలాజికల్ సైన్సెస్ ప్రొఫెసర్ రోహిణి బాలకృష్ణన్ వెల్లడించారు. గీతం వర్సిటీ స్కూల్ ఆఫ్ సైన్స్ జీవశాస్త్ర విభాగంలో జరిగిన కార్యక్రమంలో సోమవారం ఆమె మాట్లాడారు. సంతానోత్పత్తి సమయంలో ఆడ పురుగులను ఆకర్షించడానికి మగ పురుగులు ధ్వని చేయడం ద్వారా సమాచారం పంపుతాయని, ఇవి ఒక్కొక్క జాతి పురుగుల్లో ఒక్కొక్క రకమైన శబ్ద భాష ఉంటుందన్నారు. ఆసక్తికరమైన ఈ అధ్యయనంపై మరింత లోతుగా పరిశోధనలు చేయనున్నట్టు తెలిపారు.

ఆర్టీసీలో వాట్సాప్ గవర్నెన్స్

... 5వ పేజీ తరువాయి

వాట్సాప్ గవర్నెన్స్ సేవకు ప్రభుత్వం 955 2300 009 నంబర్‌ను కేటాయించింది. ఈ నంబర్‌ను వినియోగించుకొని ఆర్టీసీ సేవలు పొందవచ్చు. అధికారులకు సూచనలు, సలహాలు ఇవ్వవచ్చు. డాక్యుమెంట్లు ఫార్వర్డ్ చేయవచ్చు. ప్రధానంగా టికెట్ రిజర్వేషన్, రద్దు వంటి వాటికి బాగా ఉపయోగపడుతుందని అధికారులు భావిస్తున్నారు. ఈ నంబర్‌ను వాట్సాప్‌లో సేవ్ చేసుకొని దాన్ని ఓపెన్ చేసి హాయ్ అని టైప్ చేసి ఫార్వర్డ్ చేయాలి. వెంటనే మీకు కావలసిన సేవను ఎంచుకోండి అని స్ర్కీన్‌పై వస్తుంది. అందులో బస్ టికెట్ బుకింగ్, బస్ టికెట్ రద్దు అని రెండు ఆప్షన్లు వస్తాయి. ఈ ఆప్షన్‌లో ఎక్కడి నుంచి ఎక్కడి వరకైనా టికెట్ బుక్ చేసుకోవచ్చు, అలాగే రద్దు చేసుకోవచ్చు. భవిష్యత్తులో బస్సుల ట్రాకింగ్ సిస్టమ్, లాజిస్టిక్స్ సేవలు అందుబాటులోకి తీసుకురానున్నట్టు అధికారులు వెల్లడించారు.


విద్యార్థులకు మొక్కలు పంపిణీ చేస్తున్న దృశ్యం

పర్యావరణాన్ని పరిరక్షిద్దాం

ఉక్కుటౌన్‌షిప్, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని వడ్లపూడి అంబేద్కర్ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ చక్రధర్ అన్నారు. ఇంటర్ విద్యార్థులకు సోమవారం పర్యావరణం, మానవత విలువలపై పరీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం కాలుష్యం బాగా పెరిగిపోయిందని, దీని నివారణకు మొక్కలు పెంచడం ఒక్కటే మార్గమన్నారు. అందరూ ఏదో ఒక సందర్భంలో మొక్కలు నాటాలని కోరారు. అనంతరం విద్యార్థులకు మొక్కలు పంపిణీ చేశారు. సిబ్బంది అరుణ్‌కుమార్, చిన్నారావు, యల్లాజీ, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా పెంటమాంబ పరస

అగనంపూడి, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): జీవీఎంసీ 85వ వార్డు ఫార్మాసిటీ పునరావాస కాలనీ దొప్పవానిపాలెం గ్రామస్థుల ఆరాధ్య దేవత పెంటమాంబ పరసను సోమవారం ఘనంగా నిర్వహించారు. ఆలయ కమిటీ ప్రతినిధులు వేకువ జామున అమ్మవారిని ప్రత్యేక పుష్పాలు, నూతన వస్త్రాలతో అలంకరించి తొలిపూజ చేశారు. అనంతరం పెద్దసంఖ్యలో భక్తులు విచ్చేసి అమ్మవారిని దర్శించుకుని మొక్కులు చెల్లించారు. సాయంత్రం ఆలయ ఆవరణలో ఏర్పాటు చేసిన పరసలో సాంస్కృతిక ప్రదర్శనలు అలరించాయి. ఆలయ కమిటీ ప్రతినిధులు ఏదూరి పైడిరాజు (కేసీఆర్), డి.పైడిరాజు, డి.ఆనంద్, చిన వెంకటరమణ, మొల్లి అప్పారావు, గోవింద్, వై.వెంకటరమణ, ఆనంద్, తదితరులు పాల్గొన్నారు.

కార్మికులను భయభ్రాంతులకు గురి చేయవద్దు

ఇంటక్ ప్లాంట్ నాయకుడు 'నీరుకొండ'

ఉక్కుటౌన్‌షిప్, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): స్టీల్‌ప్లాంట్ కార్మికులను భయభ్రాంతులకు గురిచేసేలా యాజమాన్యం, కేంద్ర ప్రభుత్వం వ్యవహరిస్తుండడం సమంజసం కాదని ఇంటక్ ప్లాంట్ నాయకుడు నీరుకొండ రామచంద్రరావు అన్నారు. స్టీల్‌ప్లాంటులో సోమవారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ సంస్థ ప్రగతి కోసం ప్రతి కార్మికుడు ఎంతో కృషి చేస్తుంటే వారి ఆత్మస్థైర్యాన్ని దెబ్బతీసేలా రోజుకొక ఉత్తర్వులతో భీతిల్లిలా చేయడం దారుణమన్నారు. బంగారు బాతు లాంటి ఉక్కు కర్మాగారాన్ని నిర్వీర్యం చేసేందుకు జరుగుతున్న కుట్రను తాము తిప్పికొడతామన్నారు. సమావేశంలో నాయకులు కొవిరి అవతారం, బీఎస్ రాజు, గొందేశి ప్రభాకరరెడ్డి, కొమ్ము ప్రసాద్, ఏఎస్ నాయుడు, తదితరులు పాల్గొన్నారు.

సినిమా గైడ్

● **మదగజరాజ:** జగదాంబ, సంగం, కామేశ్వరి, వెంకటేశ్వర-1, ఊర్వశి (కంచరపాలెం), సౌజన్య (గోపాలపట్నం), మోహిని (గాజువాక), అన్నపూర్ణ (కూర్మన్నపాలెం),
● **మహిష:** రమాదేవి
● **సంక్రాంతికి వస్తున్నాం:** శ్రీలీలామహల్, శారద, శ్రీరామ, మెలోడి, జగదాంబ, కిన్నెర, గోకుల్, కాంతి, శ్రీలక్ష్మీనరసింహ-1,2 (104 ఏరియా), శ్రీనరసింహ (గోపాలపట్నం), శ్రీకన్య (గాజువాక), లిఖిత (శ్రీహరిపురం), అరుణ (పెదగంట్యాడ), తాతా, రాములమ్మ (తగరపువలస)
● **డాకు మహారాజ్:** శ్రీవెంకటేశ్వర, శరత్, శ్రీకన్య, కిన్నెర, శ్రీలక్ష్మీనరసింహ-1 (104 ఏరియా), సుకన్య, మోహిని కాంప్లెక్స్, శ్రీకన్య హెవెన్ (గాజువాక), నటరాజ్-1 (పెందుర్తి), గణేష్, సప్తగిరి (తగరపువలస)
● **గేమ్ ఛేంజర్:** మెలోడి, సంగం, కామేశ్వరి, గోకుల్, శ్రీలక్ష్మీనరసింహ-2 (104 ఏరియా), నరసింహ (గోపాలపట్నం),కన్య కాంప్లెక్స్, మోహిని కాంప్లెక్స్ (గాజువాక), లిఖిత (శ్రీహరిపురం), సీతారామయ్య (పరవాడ), నటరాజ్-2 (పెందుర్తి) రాములమ్మ (తగరపువలస)

రైతు బజార్‌లో ధరలు (కిలో)

ఉల్లిపాయలు 29, టమాటా 12, వంకాయలు (తెలుపు) 22, వంకాయలు (నలుపు) 26, బెండకాయలు 46, పచ్చిమిర్చి 34, కాకరకాయలు 42, బీరకాయలు 50, ఆనపకాయ 12, కాలీఫ్లవర్ 12, క్యాబేజీ 10, క్యారెట్ 22, దొండకాయలు 34, బంగాళదుంపలు 16, అరటికాయ (పెద్దది) 7, అల్లం (పాతది) 44, బరబాటి 34, మునక్కాడలు (కిలో) 100, ముల్లంగి 24, నిమ్మకాయలు (కిలో) 62, బద్దచిక్కుడు 24, దోసకాయలు 26, వెల్లుల్లి (పెద్దవి) 240, కొబ్బరికాయ (పెద్దది) 25, బీన్స్ (పెన్సిల్) 44, కీర దోస 32, క్యాప్సికమ్ 40, పొట్లకాయ (పెద్దది) 28, చేమదుంపలు 38, చిలగడదుంపలు 36, కంద 56, దేముడుచిక్కుడు 28, గోరుచిక్కుడు 26, కూరపెండలం 26, బ్రకోలి 55, నూల్‌కోల్ 30, పనసపొట్టు 200, కొండఉసిరి 60, కొత్తిమీర (పెద్దకట్ట) 25, కరివేపాకు (కిలో) 60, పుదీన (కట్ట) 5, చుక్కకూర (కట్ట) 4, పాలకూర (కట్ట) 4, తోటకూర (కట్ట) 4, మామిడికాయలు 120, బూడిద గుమ్మడికాయ 30, కర్రపెండలం 18, మామిడి అల్లం 46, బొప్పాయి 38, జామకాయలు (కిలో) 60.

కోడిగుడ్లు (నెక్)	
(వంద - రూ.లలో)	
విశాఖపట్నం	490
విజయనగరం	494
శ్రీకాకుళం	494

చికెన్ ధరలు	
బ్యాగ్	
రైతు ధర	100
లైవ్ ధర	120
విత్ స్కిన్	210
స్కిన్‌లెస్	220


పెదగంట్యాడ ఇండస్ట్రియల్ ఎస్టేట్ ప్రధాన రహదారిలో వృథాగా పారుతున్న నీరు


65 వార్డు పరిధి వికాస్‌నగర్‌లో తాగునీరు వృథాగా పోతున్న దృశ్యం

వృథాగా పోతున్న తాగునీరు

» ప్రధాన రహదారులపై నీరు పారుతున్నా అధికారులు పట్టించుకోవడం లేదని ప్రజల ఆవేదన

పెదగంట్యాడ, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): పెదగంట్యాడ ఇండస్ట్రియల్ ఎస్టేట్ ప్రధాన రహదారిలో అండర్ గ్రౌండ్ వాటర్ పైపు లైన్ లీకేజీ కారణంగా అధిక మొత్తంలో తాగునీరు వృథాగా పోతుంది. ఇలా లీకైన నీరు ప్రధాన రహదారిపై పారుతూ మురుగు కాలువలో కలుస్తుండడం ఎంతో బాధాకరంగా ఉందని స్థానికులు వాపోతున్నారు. కొత్త దిబ్బపాలెం, ఇండస్ట్రియల్ ఎస్టేట్ ప్రాంతాలకు కొళాయిల ద్వారా సరఫరా కావాల్సిన తాగునీరు లీకేజీ కారణంగా అధిక మొత్తంలో డ్రైనేజీలో కలుస్తుందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

దీనివల్ల ఇళ్లకు పూర్తి స్థాయిలో తాగునీరందక తాము తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నామని ప్రజలు చెబుతున్నారు. వారం రోజులుగా నీరు వృథాగా పోతున్నా పట్టించుకునే నాథులే కరువయ్యారని ఆవేదన చెందుతున్నారు. అదేవిధంగా 65వ వార్డు పరిధి వికాస్‌నగర్ కాలనీకి తాగునీరందించే అండర్ గ్రౌండ్ పైపు లైన్‌కు లీకేజీ ఏర్పడడంతో నీరు వృథాగా పోతుందని స్థానికులు వాపోతున్నారు. ప్రధాన రోడ్డులోనే నీరు వృథాగా పోతున్నా పట్టించుకునే నాథులే కరువయ్యారని ప్రజలు మండిపడుతున్నారు. ఇప్పటికైనా తాగునీటి సరఫరా విభాగం అధికారులు స్పందించి పైపు లైన్‌లకు మరమ్మతులు చేపట్టి నీటి సరఫరా సజావుగా జరిగేలా చూడాలని వారు కోరుతున్నారు.

గొడౌన్ల సమస్యను పోర్టు అధికారులకు నివేదించిన కాలనీ వాసులు


పోర్టు అధికారులకు సమస్యలను వివరిస్తున్న నాయకులు

అక్కిరెడ్డిపాలెం, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): అక్కిరెడ్డిపాలెం, పంచవటి కాలనీల సమీపంలోని పోర్టు స్థలంలో నిర్మిస్తున్న గొడౌన్ల పట్ల స్థానికుల నుంచి తీవ్ర నిరసన వ్యక్తమవుతుండడంతో సోమవారం విశాఖ పోర్టు అధికారులు శాంతిస్వరూప్, భట్నాగర్‌లు ఆ ప్రాంతాన్ని సందర్శించారు. ఈ విషయం తెలుసుకున్న ఆయా కాలనీల నాయకులు అక్కడకు చేరుకుని తమ సమస్యలను అధికారులకు విన్నవించారు. ఇక్కడ గ్రీన్ పెట్రోకోక్ నిల్వ చేసేందుకు సాస్వీర కంపెనీ నిర్మిస్తున్న గొడౌన్ల తమకు ఇబ్బందులు ఎదురవుతాయని ఆవేదన వ్యక్తం చేశారు. జనావాసాలు చేరువలో గ్రీన్ పెట్రోకోక్ నిల్వ ఉంటే అక్కిరెడ్డిపాలెం, పంచవటి కాలనీ, మింది పరిసర ప్రాంతాల్లో జల, వాయు కాలుష్యం ఏర్పడు తుందని, దీనివల్ల ప్రజలు అనారోగ్యాల బారినపడతారన్నారు. అందువల్ల ఇక్కడ గొడౌన్ల నిర్మాణాన్ని నిలిపి వేయాలని స్థానిక నాయకులు గుడివాడ లతీశ్, సర్వసిద్ధి అనంతలక్ష్మి, గుంటూరు నరసింహమూర్తి, అంగ లోకేశ్, పి.చిన్నారావు, ఎ.శ్రీను, మురళి, తదితరులు విజ్ఞప్తి చేశారు.

నడుపూరులో మృత్యుంజయస్వామి విగ్రహ ప్రతిష్ఠ


పూజల్లో పాల్గొన్న భక్తులు

పెదగంట్యాడ, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): జీవీఎంసీ 76వ వార్డు పరిధి నడుపూరులోని సంకట విమోచన గణపతి ఆలయ ప్రాంగణంలో సోమవారం మృత్యుంజయేశ్వరస్వామి విగ్రహ ప్రతిష్ఠాపనను వైభవంగా నిర్వహించారు. ముందుగా అర్చకులు సహస్ర కలశాలతో స్వామివారిని అభిషేకించి, పూజలు చేశాక భక్తులకు దర్శన భాగ్యం కల్పించారు. అనంతరం హోమం జరిపారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ అధ్యక్షుడు మంత్రి నరసింహమూర్తి, ఇంటక్ జాతీయ ప్రధాన కార్యదర్శి మంత్రి రాజశేఖర్ దంపతులు, వైసీపీ నాయకుడు మంత్రి శంకర నారాయణ దంపతులు, తదితరులు పాల్గొన్నారు.

ఉక్కు వైఎస్సార్‌టీయూసీలో వర్గ పోరు!

ఎవరికి వారే అన్నట్టుగా వ్యవహరిస్తున్న నాయకులు

ఉక్కుటౌన్‌షిప్, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): స్టీల్‌ప్లాంటులోని వైఎస్సార్‌టీయూసీ యూనియన్‌లో వర్గ పోరు నడుస్తుంది. యూనియన్ నాయకత్వంపై రెండు వర్గాలు ఆధిపత్యం కోసం పోటీ పడుతున్నాయి. యూనియన్ ప్రధాన కార్యదర్శిగా ఉన్న వై.మస్తానప్ప ఇటీవల మృతి చెందారు. దీంతో యూనియన్ కార్యవర్గాన్ని మార్పు చేశారు. ఈ మార్పులో గతంలో ఎప్పటినుంచో ఉన్న ఉద్యోగులకు ప్రాధాన్యం ఇవ్వకుండా ఇతరులకు కార్యవర్గంలో స్థానం కల్పించారన్న ఆరోపణలు వెలువెత్తుతున్నాయి. రెండు నెలల కిందట యూనియన్ నాయకత్వాన్ని మార్పు చేసినప్పటి నుంచి తమను చిన్నచూపు చూస్తున్నారంటూ ఓ వర్గం యూనియన్ కార్యకలాపాలకు దూరంగా ఉంటుంది. దీనిపై మాజీ ఎమ్మెల్యే వద్ద పంచాయితీ కూడా జరిగినట్టు తెలిసింది. త్వరలోనే అన్ని సద్దుకుంటాయని, కార్మిక సంక్షేమమే ప్రధాన అజెండాగా ముందుకు సాగుతామని మరో వర్గం పేర్కొంటుంది.

ప్రమాదకరమైన మలుపుతో వాహన చోదకుల అవస్థలు

» హెచ్చరిక బోర్డులూ ఏర్పాటు చేయని వైనం
» స్పీడ్ బ్రేకర్లు వేయాలని స్థానికుల వినతి


ఎంఈఎస్ పంపుహౌస్ వద్ద ప్రమాదాలకు నిలయంగా మారిన మలుపు

గోపాలపట్నం, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): స్థానిక కొత్తపాలెం గ్రామం నుంచి నరవ వెళ్లే ప్రధాన రహదారిలో ఎంఈఎస్ పంపుహౌస్ వద్ద ఉన్న ప్రమాదకరమైన మలుపుతో వాహన చోదకులు తీవ్ర అవస్థలు పడుతున్నారు. దీని వద్ద తరచూ ప్రమాదాలు జరగడంతో భీతిల్లుతున్నారు. నిత్యం వందల సంఖ్యలో వాహనాలు ఈ మార్గం నుంచి రాకపోకలు సాగిస్తుంటాయి. ఈ మలుపు వద్ద వాహన చోదకులు మితిమీరిన వేగంతో రావడంతో ప్రమాదాలు ఎక్కువగా జరుగుతున్నాయి. కానీ ఎలాంటి హెచ్చరిక బోర్డులూ ఏర్పాటు చేయలేదు. అధికారులు దృష్టి సారించి ఈ మలుపు వద్ద రెండువైపులా స్పీడు బ్రేకర్లు ఏర్పాటు చేసి రోడ్డు ప్రమాదాలు జరగకుండా చర్యలు చేపట్టాలని వాహన చోదకులు కోరుతున్నారు.

కోరమాండల్ ఆధ్వర్యంలో మెగా మెడికల్ క్యాంప్


జ్యోతి ప్రజ్వలన చేసి శిబిరాన్ని ప్రారంభిస్తున్న రెడ్డిపల్లి శ్రీనివాస్

మల్కాపురం, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): కోరమాండల్ ఎరువుల కర్మాగారం లిమిటెడ్ సామాజిక సేవ కార్యక్రమంలో భాగంగా స్థానిక గుల్లలపాలెంలో సోమవారం మెగా మెడికల్ క్యాంప్ నిర్వహించారు. సంస్థ డిప్యూటీ జనరల్ మేనేజర్ (హెచ్ఆర్) రెడ్డిపల్లి శ్రీనివాస్ జ్యోతి ప్రజల్వన చేసి శిబిరాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పరిశ్రమ పరిసర ప్రాంత నివాసితులకు అనేక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. శిబిరంలో పిల్లలు, మహిళలకు ప్రత్యేకంగా వైద్యసేవలు అందించామన్నారు. శిబిరంలో 350 మందికి వివిధ రకాల వైద్య సేవలందించామన్నారు. కార్యక్రమంలో సీనియర్ మేనేజర్ శ్రీకాంత్, డిప్యూటీ మేనేజర్ (సీఎస్ఆర్) వెంకటరమణ, చీఫ్ మెడికల్ ఆఫీసర్ ఉదయ్, సీఎస్ఆర్ ప్రతినిధి ధర్మాల వేణుగోపాల్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

జాతీయ వైజ్ఞానిక ప్రదర్శన పోటీలకు విద్యార్థులు ఎంపిక


విద్యార్థులతో హెచ్ఎం కృష్ణారావు, తదితరులు

అగనంపూడి, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): అగస్త్య ఫౌండషన్ ఆధ్వర్యంలో బెంగళూర్‌లో ఈ నెల ఐదు నుంచి రెండు రోజుల పాటు జరగనున్న జాతీయ స్థాయి వైజ్ఞానిక ప్రదర్శన పోటీలకు స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు కె.జశ్వంత్, జి. రోహిత్‌లు ఎంపికయ్యారు. ఈ సందర్భంగా వారిని హెచ్ఎం కృష్ణారావు, సైన్స్ ఉపాధ్యాయురాలు పి.కృష్ణవేణి అభినందించారు. జాతీయ స్థాయి పోటీల్లో సత్తా చాటాలని ఆకాంక్షించారు.

'స్టీల్‌ప్లాంటుకు ప్యాకేజీ ప్రకటించడం హర్షణీయం'

ఉక్కుటౌన్‌షిప్, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): స్టీల్‌ప్లాంటును ఆదుకునేందుకు కేంద్రం భారీ ప్యాకేజీ ప్రకటించడం హర్షణీయమని బీఎంఎస్ ప్లాంట్ కాంట్రాక్టు కార్మిక సంఘం ప్రధాన కార్యదర్శి గొందేశి గురప్ప అన్నారు. బీఎంఎస్ ఆధ్వర్యంలో సాధించిన విజయాల కరపత్రాన్ని సోమవారం ఆయన కర్మాగారంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీఎంఎస్ 1955లో స్థాపించిన అనతికాలంలోనే అత్యధిక సభ్యత్వంతో దేశంలో ప్రముఖ కార్మిక సంఘంగా గుర్తింపు పొందిందన్నారు. స్టీల్‌ప్లాంటుకు భారీ ప్యాకేజీ ప్రకటించినప్పటికీ కాంట్రాక్టు కార్మికుల్లో ఆందోళన తగ్గలేదన్నారు. అందువల్ల కార్మికులకు ఉద్యోగ భద్రత కల్పించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో పలువురు నాయకులు పాల్గొన్నారు.

వేపగుంటలో వీఎంఆర్డీఏ కమిషనర్ పర్యటన


అధికారులకు సూచనలిస్తున్న కమిషనర్ విశ్వనాథన్

విశాఖపట్నం, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): క్షేత్రస్థాయి పర్యటనలో భాగంగా వీఎంఆర్డీఏ కమిషనర్ కేఎస్ విశ్వనాథన్ సోమవారం వేపగుంటనుంచి పినగాడి వరకు 150 అడుగుల మేర విస్తరించనున్న రోడ్డును పరిశీలించారు. అనంతరం అనకాపల్లి జిల్లా కోడూరు నుంచి అసకపలి రోడ్డు, రావుగోపాలరావు ఆడిటోరియం ఆధునికీకరణ, కొత్తపాలెంలో సుమారు ఏడు ఎకరాల్లో చేపట్టబోతున్న ఉద్యానవన పనులు, తుమ్మపాలలో నిర్మించతలపెట్టిన కన్వెన్షన్ సెంటర్, షాపింగ్ కాంప్లెక్సు పనులను అనకాపల్లి కలెక్టర్ విజయ్‌కృష్ణన్‌తోపాటు పరిశీలించారు. పర్యటనలో ముఖ్యప్రణాళికాధికారి శిల్ప, ప్రధాన ఇంజనీర్ భవానీశంకర్, ఎల్‌పీఓ వేణుగోపాల్, ఈఈ రాంబాబు, ఏఈ ప్రసాద్ తదితరులున్నారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ కలయిక


ఉపాధ్యాయురాలిని సత్కరించిన పూర్వ విద్యార్థులు

అక్కిరెడ్డిపాలెం, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): అక్కిరెడ్డిపాలెం హైస్కూల్‌లో 1990-91, 1991-92 బ్యాచ్‌లకు చెందిన పదో తరగతి విద్యార్థుల ఆత్మీయ కలయిక కార్యక్రమం సోమవారం పాఠశాలలో సందడిగా సాగింది. సుమారు 35 ఏళ్ల తర్వాత కలుసుకున్న వారంతా ఒకరికొకరు యోగ క్షేమాలు, ఉద్యోగాలు, పిల్లలు, వారి పెళ్లిళ్ల గురించి అడిగి తెలుసుకున్నారు. నాడు తమకు విద్యాబుద్ధులు నేర్పిన గురువులను సత్కరించారు. అలాగే ఎనిమిది నుంచి పదో తరగతి చదువుతున్న విద్యార్థులకు పెన్నులు, ప్లాంకులు, ఇతర పాఠ్య సామగ్రిని అందజేశారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు వై.మహేశ్, అంజి, వి.గోవిందరాజు, ఎ.నాగరాజు, కె.శ్రీనివాసరావు, రమేశ్, తదితరులు పాల్గొన్నారు.

'లక్ష డప్పులు-వేల గొంతులు'ను విజయవంతం చేయాలి

ఎన్ఏడీ జంక్షన్, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): 'లక్ష డప్పులు- వేల గొంతులు' కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని మాదిగ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు కోరారు. బుచ్చిరాజుపాలెం కమ్యూనిటీహాల్‌లో సోమవారం నిర్వహించిన సమావేశంలో ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మందకృష్ణ మాదిగకు పద్మశ్రీ పురస్కారం ప్రకటించినందుకు కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలకు ధన్యవాదాలు తెలిపారు. ఈనెల 7న తెలంగాణలో జరిగే 'లక్ష డప్పులు- వేల గొంతులు' సమావేశానికి విశాఖపట్నం, ఇతర ప్రాంతాల నుంచి భారీసంఖ్యలో సభ్యులు తరలివెళ్లి ఐక్యత చాటాలన్నారు. సమావేశంలో కె.సాధూరావు, జి.వెంకటేశ్వరరావు, రమేష్, కె.నాగరాజు, ఎస్.పైడిరాజు, గోవింద్, జి.సీతారామ్, రవికుమార్, శ్రీను, నరసింగరావు తదితరులు పాల్గొన్నారు.


చిన్నారులతో కలిసి కార్యక్రమంలో పాల్గొన్న తల్లిదండ్రులు

త్రిశక్తి ఆలయంలో సామూహిక అక్షరాభ్యాసాలు

ఉక్కుటౌన్‌షిప్, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): వసంత పంచమి సందర్భంగా స్టీల్‌ప్లాంట్ త్రిశక్తి ఆలయంలో సోమవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయంలోని అమ్మవార్లను ప్రత్యేకంగా అలంకరించారు. ఈ సందర్భంగా తల్లిదండ్రులు అధిక సంఖ్యలో తమ పిల్లలతో విచ్చేసి సామూహిక అక్షరాభ్యాసాల కార్యక్రమంలో పాల్గొన్నారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ఆలయ కమిటీ ప్రతినిధులు ఏర్పాట్లు చేశారు. ప్రధాన అర్చకులు ఫణిశర్మ ఆధ్వర్యంలో చిన్నారులతో అక్షరాభ్యాసం చేయించారు.

సరస్వతీదేవికి ఆలయాలు, విద్యాలయాల్లో పూజలు

అక్కిరెడ్డిపాలెం: వసంత పంచమి సందర్భంగా పలు ఆలయాలు, విద్యా కేంద్రాలలో సరస్వతీదేవికి పూజలు జరిపారు. తుంగ్లాంలోని విజయరాఘవస్వామి ఆలయంలో ప్రధాన అర్చకులు దేవీశర్మ ఆధ్వర్యంలో వేదపండితులు సరస్వతీదేవికి పూజలు చేసి చిన్నారులచే సామూహిక అక్షరాభ్యాసం చేయించారు. కార్పొరేటర్ కాకి గోవిందరెడ్డి చిన్నారులకు పుస్తకాలు, ఇతర పాఠ్య సామగ్రిని అందజేశారు. వెంకటేశ్వర కాలనీలోని బీవీకే పాఠశాలలో, షీలానగర్ ఎస్టీబీఎల్‌లోని తిరుమల బాలాజీ దివ్యక్షేత్రంలో అర్చకులు ప్రవీణ్ కుమార్ ఆధ్వర్యంలో పిల్లలచే సామూహిక అక్షరభ్యాసాలు చేపట్టారు.

కనీస పెన్షన్ రూ.9 వేలు చేయాలి

పెదగంట్యాడ, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వ రంగ సంస్థల్లో పనిచేసి ఉద్యోగ విరమణ చేసిన వారికి కనీస పెన్షన్‌గా రూ.9 వేలు చేయాలని ఆల్ పెన్షనర్ అండ్ రిటైర్డ్ పర్సన్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు కె.దీనబంధు డిమాండ్ చేశారు. ఇక్కడి సీడబ్ల్యూసీలో సోమవారం అసోసియేషన్ పారిశ్రామిక ప్రాంత శాఖ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం గరిష్ఠంగా పెన్షన్ రూ.నాలుగు వేలు మాత్రమే వస్తుందని, ఇది వైద్య ఖర్చులకు కూడా చాలడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. అందువల్ల పెన్షనర్లకు రాష్ట్ర ప్రభుత్వ సాయంగా రేషన్ కార్డు, ఆరోగ్యశ్రీ వంటి సౌకర్యాలను కల్పించాలని కోరారు. సమావేశంలో అసోసియేషన్ ప్రతినిధులు కె.అప్పలరాజు, ఎస్కే. హుస్సేన్, పి.గురునాథ్, అప్పలనాయుడు, వెంకటరావు, తదితరులు పాల్గొన్నారు.

హయ్యర్ పెన్షన్ సమస్యను పరిష్కరించాలని వినతి

ఉక్కుటౌన్‌షిప్: స్టీల్‌ప్లాంటులో పదవీ విరమణ చేసి హయ్యర్ పెన్షన్ కోసం దరఖాస్తు చేసుకున్న వారికి న్యాయం జరిగేలా చూడాలని కోరుతూ సోమవారం పీఎఫ్ కమిషనర్‌ను ప్లాంట్ పెన్షనర్ల అసోసియేషన్ ప్రతినిధులు కలిసి వేడుకున్నారు. హయ్యర్ పెన్షన్ కోసం పీఎఫ్ కార్యాలయం సుమారు 2,500 మందికి నోటీసులు ఇవ్వడంతో సుమారు రూ.410 కోట్లను పీఎఫ్ కార్యాలయానికి చెల్లించడం జరిగిందన్నారు. కేవలం మూడు నెలల్లోనే హయ్యర్ పెన్షన్ మంజూరు చేయాల్సి ఉన్నా ఇప్పటికీ అమలుకు నోచుకోలేదని వారు ఆవేదన వ్యక్తం చేశారు.

యారాడ తీరంలో తాబేళ్ల మృత్యువాత


తీరంలో తాబేలు కళేబరం

సింధియా, ఫిబ్రవరి 3, (ఆంధ్రజ్యోతి): గత కొద్ది రోజులుగా యారాడ సముద్ర తీరంలో తాబేళ్ల మృత కళేబరాలు దర్శనమిస్తున్నాయి. సముద్ర జలాలు కలుషితం కావడమే ఇవి మృతిచెందడానికి కారణమని మత్స్యకారులు చెబుతున్నారు. తీరంలోని ఇసుకలో తాబేళ్ల కళేబరాలు కుళ్లిపోయి దుర్గంధం వెలువడుతోంది. దీంతో పర్యాటకులు తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారు. అధికారులు స్పందించి తాబేళ్ల మృత్యువాతకు కారణాలపై విచారణ చేపట్టాలని పర్యావరణ ప్రేమికులు కోరుతున్నారు.

ఫార్మసీ సదస్సులో అధ్యాపకులు, విద్యార్థుల ప్రతిభ

అగనంపూడి, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): గుంటూరులో ఇటీవల అంతర్జాతీయ స్థాయిలో జరిగిన ఔషధ శాస్త్రం సదస్సులో విజ్ఞాన్ ఫార్మసీ విద్యార్థులు, అధ్యాపక సిబ్బంది పాల్గొని మంచి ప్రతిభ కనబరిచి బహుమతులు సాధించారు. ఈ సందర్భంగా సోమవారం కళాశాలలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో వారిని ప్రిన్సిపాల్ వై.శ్రీనివాసరావు అభినందించారు. కార్యక్రమంలో కో-ఆర్డినేటర్ కమలకుమారి, ఫార్మసీ విభాగం అధ్యాపక సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

'హత్యాచార నిందితుడిని ఉరి తీయాలి'


ఆందోళన చేస్తున్న ఎస్ఎఫ్ఐడబ్ల్యు సభ్యులు

పెందుర్తి, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): ఉత్తరప్రదేశ్‌లోని అయోధ్యలో దళిత యువతిపై హత్యాచారం చేసిన నిందితుడ్ని ఉరితీయాలని పెందుర్తి ఎస్ఎఫ్ఐడబ్ల్యు సమితి ఆధ్వర్యంలో సోమవారం ఆందోళన నిర్వహించారు. మండల పరిషత్ ఆవరణలోని అంబేడ్కర్ విగ్రహం వద్ద సమాఖ్య అధ్యక్ష, కార్యదర్శులు ఎస్.అరుణ మాట్లాడుతూ ఎన్‌డీఏ పాలిత ప్రభుత్వాల హయాంలో మైనారిటీ మహిళలపై అత్యాచారాలు అధికమవుతున్నాయని ఆరోపించారు. కార్యక్రమంలో రజిని, దేవి, సంతోషి, లక్ష్మి, దీవెన పాల్గొన్నారు.

ఉన్నత పాఠశాలకు ఎల్అండ్‌టీ వితరణ


విద్యార్థులతో నిర్వహించిన సమావేశంలో మాట్లాడుతున్న డీవీఎస్ఎన్ రాజు

మల్కాపురం, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): మల్కాపురం జీవీఎంసీ ఉన్నత పాఠశాలకు ఎల్అండ్‌టీ సంస్థ వంద డ్యూయల్ డెస్క్‌ను సోమవారం బహూకరించింది. ఈ సందర్భంగా విద్యార్థులతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఎల్అండ్‌టీ డీజీఎం డీవీఎస్ఎన్ రాజు, యాదవేంద్రసింగ్ మాట్లాడారు. సామాజిక సేవ కార్యక్రమంలో భాగంగా ఎల్అండ్‌టీ సంస్థ అనేక కార్యక్రమాలు చేస్తోందన్నారు. ముఖ్యంగా విద్యార్థులకు రక్తపరీక్షలు చేయించడం, కౌమారదశలో బాలికల సౌకర్యార్థం ఇన్సినేటర్ బహూకరణ, బాలికల ఆరోగ్యం రీత్యా వారికి జాగ్రత్తలు తెలిపేందుకు వలంటీరు జ్యోతిని నియమించామన్నారు. కార్యక్రమానికి పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు అరుణకుమారి అధ్యక్షత వహించారు. విద్యార్థులకు డ్యూయల్ డెస్క్‌లను అందించడం పట్ల అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు బీవీఎస్ కుమార్, రామారావు తదితరులు పాల్గొన్నారు.

ప్రారంభమైన శారదాపీఠం వార్షికోత్సవాలు

పెందుర్తి, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): చినముషిడివాడలోని శారదాపీఠం వార్షికోత్సవాలు సోమవారం ప్రారంభమయ్యాయి. ఉత్తర పీఠధిపతి స్వాత్మానందేంద్ర సరస్వతి దేవతామూర్తులకు పూజలు చేశారు. అనంతరం వసంత పంచమి సందర్భంగా పీఠం అధిష్టాన దేవత శారదాస్వరూప రాజశ్యామల అమ్మవారి సన్నిధిలో చిన్నారులకు సామూహిక అక్షరాభ్యాసాలు నిర్వహించారు. సాయంత్రం చంద్రమౌళీశ్వరులకు పీఠ పూజ చేశారు.

పారా అథ్లెటిక్స్‌లో వైద్య విద్యార్థికి పతకం



విద్యార్థి ఆధావన్‌కు ప్రశంసాపత్రం అందజేస్తున్న ఏఎంసీ ప్రిన్సిపాల్ బుచ్చిరాజు

విశాఖపట్నం స్పోర్ట్సు ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): పారా అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్ టోర్నీలో ఆంధ్ర వైద్య కళాశాల విద్యార్థి (2కె 24 బ్యాచ్) కె.ఆధావన్ పతకం సాధించాడు. మంగళగిరిలో జరిగిన ఏడవ రాష్ట్ర స్థాయి పారా అథ్లెటిక్స్ మీట్ షాట్‌పుట్ ఈవెంట్‌లో ఆధావన్ ప్రతిభ కనబరిచి కాంస్య పతకం సాధించాడు. ఈ సందర్భంగా ఆంధ్ర వైద్య కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ జి.బుచ్చిరాజు సోమవారం తన కార్యాలయంలో ఆధావన్‌ను అభినందించి రూ.5 వేల నగదు ప్రోత్సాహాన్ని అందించారు. జాతీయ టోర్నీలలో రాణించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ఆంధ్ర వైద్య కళాశాల స్పోర్ట్సు వైస్ ప్రెసిడెంట్ డాక్టర్ ఆర్.సునీల్‌కుమార్, ఫిజికల్ డైరక్టర్ డాక్టర్ ఎంఎస్ఎన్.పాత్రుడు, పారా స్పోర్ట్సు రాష్ట్ర కార్యదర్శి రామస్వామి తదితరులు ఆధావన్‌ను అభినందించారు.

అసాంఘిక శక్తులపై ఉక్కుపాదం

... 5వ పేజీ తరువాయి

వడ్లపూడి సమీపంలోని అంబేడ్కర్ కాలనీకి చెందిన రావాడ జగదీష్ (22), రావాడ ఉదయ్‌భాస్కర్ (22), ఆర్అండ్‌బీ ప్రాంతానికి చెందిన ఈతలపాక రాజ్‌కుమార్ (22), వడ్లపూడి కణితి ఆర్‌హెచ్ కాలనీకి చెందిన కాండ్రేగుల లోక్‌నాథ్ వీరసాయిశ్రీనివాస్ (22), చినగదిలి సాయిబాబా ఆలయం సమీపంలో నివాసం ఉంటున్న నక్కా లోకేష్ (26), పీఎంపాలెం ఆర్‌హెచ్ కాలనీకి చెందిన కొలగాని పవన్ రాజ్‌కుమార్ (25)పై పీడీ యాక్ట్ (ప్రివెన్షన్ ఆఫ్ డిటెంక్షన్) అమలు చేయాలని కోరుతూ రాష్ట్ర ప్రభుత్వానికి సిఫారసు చేశారు. సీపీ సిఫార్సులను పరిశీలించిన ప్రత్యేక కమిటీ వారిపై పీడీ యాక్ట్ అమలు చేస్తూ ఆదివారం ఉత్తర్వులు జారీచేసింది.

మరోవైపు నగరంలో ప్రతిరోజూ ఎక్కడో ఒకచోట గంజాయి స్మగ్లర్లు పట్టుబడుతూనే ఉన్నారు. గంజాయి రవాణా, విక్రయాలకు పాల్పడుతున్నవారిపై పీఐటీ ఎన్‌డీపీఎస్ యాక్ట్ కింద పీడీయాక్ట్ అమలుచేయాలని సీపీ నిర్ణయించారు. నగరానికి చెందిన ఏడుగురిపై పీడీ యాక్ట్ అమలు చేయాలని కోరుతూ రాష్ట్ర ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపించారు. ఒకటి, రెండు రోజుల్లో ప్రభుత్వం నుంచి ఉత్తర్వులు వెలువడే అవకాశం ఉంది. ఒకసారి పీడీ యాక్ట్ కింద జైలుకు వెళితే కనీసం ఆరు నెలలుపాటు జైలులోనే ఉండాల్సి ఉంటుంది. బెయిల్ పిటిషన్ వేయడానికి కూడా అవకాశం ఉండదు. ఆరు నెలలు గడిచిన తర్వాత మరో ఆరు నెలలు చొప్పున...ఇలా మూడేళ్ల వరకు పోలీసులు వారిని జైలులోనే ఉంచేందుకు అవకాశం ఉంటుంది. పీడీ యాక్ట్‌ను తొలగించాలంటే నిందితుడి తరపున న్యాయవాది రాష్ట్రస్థాయిలోని ప్రత్యేక కమిటీకి దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుంది. నిందితుడు జైల్లో గడిపిన కాలంలో ప్రవర్తన మార్చుకున్నాడని, ఇకపై నేరాల జోలికి వెళ్లడని హామీ ఇచ్చేందుకు తగిన ఆధారాలను కమిటీకి అందజేయాల్సి ఉంటుంది. కమిటీ ఆయా ఆధారాల పట్ల సంతృప్తి చెందితేనే పీడీ యాక్ట్ తొలగింపునకు పరిశీలించాలంటూ రాష్ట్రప్రభుత్వానికి సిఫారసు చేసేందుకు వీలుంటుంది. కమిటీ సంతృప్తి చెందకపోతే మాత్రం జైల్లోనే నిందితుడు కాలం వెళ్లదీయాల్సి ఉంటుంది.

టీడీఆర్ హబ్‌పై ప్రభుత్వం దృష్టి

... 5వ పేజీ తరువాయి

వైవా నిర్వహణకు కొందరు అంగీకరించలేదు. అంతేకాకుండా ఉన్నతాధికారులు ఇచ్చిన ఆదేశాలపై రాష్ట్ర ప్రభుత్వానికి, ఉన్నత విద్యా శాఖకు ఫిర్యాదు చేశారు. ఈ క్రమంలో మొత్తం ప్రక్రియను నిలిపివేయాలని ఉన్నత విద్యాశాఖ ఆదేశించింది. టీడీఆర్ హబ్‌లో ఇప్పటివరకూ ఏం జరిగింది?, ప్రస్తుతం ఏం జరుగుతోంది?...అనే వివరాలు సమర్పించాల్సిందిగా ఆదేశించింది. దీంతో టీడీఆర్ హబ్‌లో ప్రవేశాలు పొందిన వారికి ఆయా విభాగాల ఆధ్వర్యంలో నిర్వహించాల్సిన ప్రీ పీహెచ్‌డీ పరీక్షలు, వైవాలను నిలిపివేసినట్టు అధికారులు ప్రకటించారు.

తొలి ఏడాదిలో 700 ప్రవేశాలు...

టీడీఆర్ హబ్‌ను 2022లో ఏర్పాటుచేశారు. అదే ఏడాది అంటే 2022-23 విద్యా సంవత్సరం నుంచి ప్రవేశాలు కల్పించారు. తొలి ఏడాది సుమారు వేయి మందికి ప్రవేశాలు కల్పించినట్టు చెబుతున్నారు. ఇందులో 681 మందికి ఏపీఆర్ సెట్ ద్వారా ప్రవేశాలు కల్పించగా, మిగిలినవారు ఎగ్జిక్యూటివ్ కోటాలో అవకాశం ఇచ్చినట్టు చెబుతున్నారు. ఆర్‌సెట్ ద్వారా కల్పించిన ప్రవేశాలపై అభ్యంతరాలు లేవు కానీ, ఎగ్జిక్యూటివ్ కోటాలో జరిగిన వాటిపై అనేక అనుమానాలు ఉన్నాయి.

సముద్ర ఉత్పత్తులపై విద్యార్థులకు అవగాహన



విద్యార్థులకు చేపలపై అవగాహన కల్పిస్తున్న మత్స్య పరిశోధకుడు కిజా కుదన్



వివిధ రకాల చేపలను తిలకిస్తున్న పాఠశాల విద్యార్థులు

మహారాణిపేట, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): కేంద్ర సముద్ర మత్స్య పరిశోధనా సంస్థ 78వ వ్యవస్థాపక దినం సందర్భంగా సోమవారం మత్స్యసంపదపై ఓపెన్ హౌస్ కార్యక్రమాన్ని నిర్వహించింది. బీచ్‌రోడ్డులో ఉన్న సీఎంఎఫ్ఆర్ఐ కార్యాలయంలో ప్రాంతీయ విభాగాధిపతి, ముఖ్య పరిశోధకుడు డాక్టర్ జె.కె.కిజాకుదన్ దీన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో పాఠశాల విద్యార్థులకు సముద్రంలో వాతావరణ పరిస్థితులు, చేపల వేటకు వెళ్లే మత్స్యకారుల సంరక్షణ, చేపల ఉత్పత్తి, సముద్రపు ఉత్పత్తుల నుంచి సంరక్షణ తదితర అంశాలపై అవగాహన కల్పించారు. వివిధ రకాల చేపలు, రొయ్యలు తదితర వాటి గురించి వివరించారు. నగరంలోని సుమారు 15 పాఠశాలలకు చెందిన విద్యార్థులు సముద్ర ఉత్పత్తులు, వాటిని పెంచే విధానాన్ని ఆసక్తిగా తిలకించారు. పరిశోధకుల ద్వారా తమ సందేహాలను నివృత్తి చేసుకున్నారు. మత్స్య పరిశోధన సంస్థ చేపడుతున్న పరిశోధనలు, భవిష్యత్‌లో సముద్ర ఉత్పత్తుల పరిస్థితిని విపులంగా తెలియజేశారు. ఈ కార్యక్రమంలో పలువురు అధికారులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ముగిసిన బాస్కెట్‌బాల్ చాంపియన్‌షిప్ టోర్నీ



విజేతలతో అతిథులు

విశాఖపట్నం స్పోర్ట్సు ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): ఏయూ గోల్డెన్ జూబ్లీ గ్రౌండ్‌లో జరిగిన జాతీయ క్రీడాకారుడు తరుణ్ స్మారక జిల్లా స్థాయి బాస్కెట్‌బాల్ టోర్నీలో ట్రూ బాలర్స్ జట్టు చాంపియన్ ట్రోఫీని కైవసం చేసుకోగా, పోలీసు బ్యారక్ జట్టు రన్నరప్‌గా నిలిచింది. సోమవారం రాత్రి ఏయూ బాస్కెట్‌బాల్ గ్రౌండ్‌లో జరిగిన టోర్నీ ముగింపు కార్యక్రమానికి జనసేన నాయకుడు ముక్కా శ్రీనివాసరావు, గీతం యూనివర్సిటీ కార్యదర్శి భరద్వాజ్ ముఖ్య అతిథులుగా హాజరై విజేతలకు ట్రోఫీలు, బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో శ్రీవాణి వేబ్రిడ్జి డైరక్టర్లు పి.అప్పారావు, పిల్లా సతీష్, జిల్లా బాస్కెట్‌బాల్ సంఘం అధ్యక్షుడు సునీల్ మహంతి, కార్యదర్శి భూషణరావు, ఇతర ప్రతినిధులు టీఎస్ఎన్.మూర్తి, వి.హనుమంతరావు, బి.పరశురాములు, తరు, బాస్కెట్‌బాల్ క్లబ్ ప్రతినిధులు అశ్విన్ అభిలాష్, జయంత్, కృష్ణ, చందు పాల్గొన్నారు.

కార్మిక పోరాటాలకు మద్దతు

అక్కయ్యపాలెం, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): విశాఖ పోర్టులో సమస్యలపై చేస్తున్న కార్మికుల అన్ని పోరాటాలకు తమ పూర్తి మద్దతు ఉంటుందని జాతీయ ఇంటక్ ఫెడరేషన్ అధ్యక్షుడు అబు బక్కర్ తెలిపారు. నేషనల్ పోర్ట్సు ట్రస్ట్ ఎంప్లాయీస్ అధ్యక్షుడు గొర్లె చందు ఆధ్వర్యంలో సోమవారం శాంతినగర్‌లోని కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. తన మొదటి పర్యటన విశాఖలో విజయవంతంగా జరిగిందన్నారు. కార్యదర్శి రాణా మాట్లాడుతూ పోర్టులో ఇంటక్ బలోపేతానికి నాయకులు కృషిచేయాలని కోరారు. గొర్లె చందు మాట్లాడుతూ జాతీయ ఫెడరేషన్ నాయకులు విశాఖ వచ్చి తమకు సహకరిస్తామని చెప్పడం ఆనందంగా ఉందన్నారు.

రైతుబజార్లలో సబ్జీ కూలర్ల మార్కెటింగ్

... 5వ పేజీ తరువాయి

అమ్ముకోవచ్చునని చెబుతున్నారు.

● విశాఖపట్నం రైతుబజార్లలో రైతులు తెచ్చిన కూరగాయలు మిగిలిపోవడం, వాటిని మళ్లీ వెనక్కి గ్రామాలకు తీసుకువెళ్లడం చాలా అరుదు. ఏ రోజు కూరగాయలు ఆరోజే అమ్మేసుకుంటారు. ఇంకా త్వరగా అయిపోతున్నాయని, ఉదయం కొందరు రైతులతో, సాయంత్రం మరికొందరు రైతులతో కూరగాయలు అమ్మిస్తున్నారు. ఈ నేపథ్యంలో ఇక్కడ ఈ కూలర్ల అవసరం లేదు.

● రైతుబజార్లలో రైతులకు కేటాయించే స్టాల్‌లో స్థలం చాలా తక్కువ. నాలుగు అడుగుల వెడల్పు, ఆరు అడుగుల పొడవు ఉండే స్థలం రైతుకు ఇస్తున్నారు. వారు తెచ్చిన కూరగాయలు పెట్టుకోవడానికే ఆ స్థలం సరిపోవడం లేదు. ఇప్పుడు ఆ స్టాల్‌లో ఈ సబ్జీ కూలర్లు పెట్టుకుంటే... మూడో వంతు స్థలం దానికే సరిపోతుంది. రైతు కూర్చొని కూరగాయలు అమ్మడానికి కూడా స్థలం ఉండదు. అంత ఇబ్బందికరమైనా పరిస్థితి ఉన్నా సరే అధికారులు కూలర్లు తీసుకోవాలని రైతులపై ఒత్తిడి పెడుతున్నారు. ఈ కూలర్లు వంద కిలోలు నిల్వ చేసుకునేది అయితే రూ.50 వేలు, 50 కిలోలు నిల్వ చేసుకునేది అయితే రూ.25,400; 25 కిలోలు నిల్వ చేసుకునేది అయితే రూ.17,700 అవుతుందని అధికారులు చెబుతున్నారు.

అంత పెద్ద మొత్తం పెట్టి కూలర్లు కొనలేమని, తమకు వాటిని నిల్వ చేసుకోవలసిన అవసరం లేదని చెబుతున్నా అధికారులు వినడం లేదు. ఒక్కో బజారుకు కనీసం పది అయినా కొనాలని చెబుతున్నారు. దీంతో అప్పో సప్పో చేసి వాటిని కొంటామని, అయితే అవి స్టాల్‌లో కాకుండా మూకుమ్మడిగా రైతుబజారులో ఒకచోట పెట్టుకునేలా ఏర్పాట్లు చేయాలని రైతులు కోరుతున్నారు. వ్యవసాయ మార్కెటింగ్ శాఖాధికారులు బెదిరింపు ధోరణితో వ్యవహరిస్తున్నందున దీనిపై జాయింట్ కలెక్టర్ జోక్యం చేసుకొని తగిన సూచనలు ఇవ్వాలని రైతులు కోరుతున్నారు.

ఆర్టీసీలో వాట్సాప్ గవర్నెన్స్

... 5వ పేజీ తరువాయి

వాట్సాప్ గవర్నెన్స్ సేవకు ప్రభుత్వం 955 2300 009 నంబర్‌ను కేటాయించింది. ఈ నంబర్‌ను వినియోగించుకొని ఆర్టీసీ సేవలు పొందవచ్చు. అధికారులకు సూచనలు, సలహాలు ఇవ్వవచ్చు. డాక్యుమెంట్లు ఫార్వర్డ్ చేయవచ్చు. ప్రధానంగా టికెట్ రిజర్వేషన్, రద్దు వంటి వాటికి బాగా ఉపయోగపడుతుందని అధికారులు భావిస్తున్నారు. ఈ నంబర్‌ను వాట్సాప్‌లో సేవ్ చేసుకొని దాన్ని ఓపెన్ చేసి హాయ్ అని టైప్ చేసి ఫార్వర్డ్ చేయాలి. వెంటనే మీకు కావలసిన సేవను ఎంచుకోండి అని స్ర్కీన్‌పై వస్తుంది. అందులో బస్ టికెట్ బుకింగ్, బస్ టికెట్ రద్దు అని రెండు ఆప్షన్లు వస్తాయి. ఈ ఆప్షన్‌లో ఎక్కడి నుంచి ఎక్కడి వరకైనా టికెట్ బుక్ చేసుకోవచ్చు, అలాగే రద్దు చేసుకోవచ్చు. భవిష్యత్తుతో బస్సుల ట్రాకింగ్ సిస్టమ్, లాజిస్టిక్స్ సేవలు అందుబాటులోకి తీసుకురానున్నట్టు అధికారులు వెల్లడించారు.

హిందీ ప్రాంతీయులకు తెలుగు సాహితీ ఔన్నత్యం



సదస్సులో మాట్లాడుతున్న బాలమోహన్ దాస్

జ్ఞానాపురం, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): స్థానిక సెయింట్ జోసెఫ్ మహిళా కళాశాలలో భాషా విభాగాల ఆధ్వర్యంలో సోమవారం భారత ప్రభుత్వ విద్యా మంత్రిత్వ శాఖ కేంద్రీయ హిందీ సంస్థాన్ (ఆగ్రా) సౌజన్యంతో 'తెలుగు జ్ఞానపీఠ పురస్కార గ్రహీతల సాహితీ కృషి' అన్న అంశంపై రెండు రోజుల జాతీయ సదస్సు ప్రారంభమైంది. ముఖ్యఅతిథులుగా హాజరైన నాగార్జున యూనివర్సిటీ పూర్వకులపతి ఆచార్య వి.బాలమోహన్‌దాస్, సెంట్రల్ హిందీ ఇన్‌స్టిట్యూట్ డైరక్టర్ సునీల్ కులకర్ణి, ప్రాంతీయ డైరెక్టర్ ఆచార్య గంగాధర్ వనోడే, హైదరాబాద్ హిందీ మహా విద్యాలయ ప్రొఫెసర్ ఆర్.సుమలతలు జ్యోతి ప్రజ్వలన చేశారు. తెలుగు సాహితీ ఔన్నత్యాన్ని హిందీ వారికి అందించే ప్రయత్నంగా కళాశాలలో ఈ సదస్సు నిర్వహించడం గర్వకారణమని కో-ఆర్డినేటర్ డాక్టర్ వి.కె.జయలక్ష్మి పేర్కొన్నారు. అనంతరం ఆమె రచించిన అభినందన గ్రంథాన్ని అతిథులు ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డా.సిస్టర్ షైజీ, డాక్టర్ నిర్మల, డాక్టర్ ఎస్.దీప్తి, డా.కోటేశ్వరరావు, డాక్టర్ భాస్కర సుధ పాల్గొన్నారు.

వందేళ్ల రైల్వే చరిత్ర ఉద్యోగులకు ఆనందకరం



ర్యాలీ నిర్వహిస్తున్న రైల్వే ఉద్యోగులు

మర్రిపాలెం, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): భారతీయ రైల్వే ఏర్పాటై వంద సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా సోమవారం మర్రిపాలెం రైల్వేస్టేషన్ నుంచి ఎలక్ట్రికల్ లోకోషెడ్ వరకు సుమారు 500 మంది ఉద్యోగులు ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీలో పాల్గొన్న డీఈఈ బి.షణ్ముఖరావు మాట్లాడుతూ భారతీయ రైల్వే అభివృద్ధిలో ప్రతి ఉద్యోగి శ్రమ, పట్టుదల ఉన్నాయన్నారు. నేటికి వంద సంవత్సరాలు పూర్తి చేసుకోవడం రైల్వేలో విధులు నిర్వహించిన, నిర్వహిస్తున్న అందరికీ ఎంతో ఆనందాన్ని ఇస్తుందన్నారు. డీఈఈ సాహు, ఎస్ఎస్ కోటిరెడ్డి, మూల మహేష్, రాజశేఖర్ పాల్గొన్నారు.

పేదలకు వీల్‌చైర్లు, కుట్టుమిషన్ల పంపిణీ



వీల్‌చైర్లు పొందినవారితో ఎమ్మెల్యే వంశీకృష్ణ, కార్పొరేటర్ నాగరాజు తదితరులు

అల్లిపురం, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): జీవీఎంసీ 32వ వార్డు నేరెళ్ల కోనేరు వద్ద దక్షిణ ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్ పుట్టిన రోజు వేడుకలను సోమవారం ఉదయం కార్పొరేటర్ కందుల నాగరాజు ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పేదలకు వీల్‌చైర్లు, కుట్టు మిషన్లు పంపిణీ చేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ నియోజకవర్గంలో కందుల నాగరాజు మంచి సేవా కార్యక్రమాలు నిర్వహించడం అభినందనీయమన్నారు. జనసేన నాయకులు శివప్రసాద్ రెడ్డి, సునీల్, దాసరి దుర్గా, దాసాన సత్యనారాయణ, శాలివాహన, గంట్ల శ్రీనుబాబు తదితరులు పాల్గొన్నారు. జ్ఞానాపురం మదర్ థెరిస్సా నిర్మల హృదయ్ వృద్ధాశ్రమంలో వార్డు టీడీపీ అధ్యక్షుడు ఐతి మధుబాబు ఆధ్వర్యంలో ఎమ్మెల్యే పండ్లు, దుప్పట్లు పంపిణీ చేశారు. అనంతరం వార్డు జనసేన నాయకులు బానోజీరావు ఆధ్వర్యంలో కేకు కోసి సంబరాలు చేశారు. వార్డు నాయకులు ఆంతోని శేఖర్, ఐతి రవిబాబు, గవర రమణ తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ అభ్యర్థి ఓట్ల వేట

అక్కయ్యపాలెం, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): ఈ నెల 27న జరిగే ఉత్తరాంధ్ర ఉపాధ్యాయుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో పోటీ చేస్తున్న తనను గెలిపించాలని సరస్వతీ విద్యా సంస్థల చైర్మన్ డాక్టర్ సుంకర శ్రీనివాసరావు అభ్యర్థించారు. సోమవారం అక్కయ్యపాలెం పరిసర ప్రాంతాల్లోని ప్రైవేటు పాఠశాలలకు వెళ్లి ఉపాధ్యాయులను వ్యక్తిగతంగా కలిసి ఓటును అభ్యర్థించారు. ఇప్పటికే ప్రధాన పార్టీల మద్దతుతో కొందరు బరిలో నిలిచారు.

విద్యాసంస్థల్లో భక్తిశ్రద్ధలతో వసంత పంచమి వేడుకలు



లలితా పీఠంలో చిన్నారికి అక్షరాభ్యాసం చేయిస్తున్న దత్తేశ్వరనంద స్వామి

కంచరపాలెం/అక్కయ్యపాలెం/అల్లిపురం/మురళీనగర్, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): వసంత పంచమి సందర్భంగా సోమవారం పలు ప్రాంతాల్లోని ఆలయాలు, విద్యాసంస్థల్లో 'సరస్వతీ నమస్తుభ్యం' అంటూ వాగ్దేవిని కొలిచారు. అక్షరాభ్యాసాలు, సరస్వతీ దేవికి పూజలు చేశారు. మాధవధార లాన్సమ్ గ్రీన్స్ దగ్గర జ్ఞాన సరస్వతి మందిరంలో విశిష్ట పూజలు చేపట్టారు. ఆలయ ఆవరణలో సామూహిక అక్షరాభ్యాసాలు నిర్వహించారు. నగరంలోని పలు ప్రాంతాల నుంచి వచ్చిన భక్తజనంతో ఆలయం సందడిగా మారింది. అక్కయ్యపాలెం లలితానగర్‌లోని లలితా పీఠంలో కుర్తాళం సిద్ధేశ్వరి పీఠం ఉత్తరాధికారి దత్తేశ్వరనంద భారతీ స్వామి చిన్నారులకు అక్షరాభ్యాసం చేశారు. పాఠశాలల నిర్వాహకులు, అధ్యాపక బృందం, విద్యార్థులు, వారి తల్లిదండ్రులు విద్యాసంస్థల్లో జరిగిన పూజా కార్యక్రమాల్లో పాల్గొన్నారు. కొన్నిచోట్ల చిన్నారులకు పెన్నులు, పుస్తకాలు పంచిపెట్టారు. కంచరపాలెంలోని విజ్ఞానభారతి, గ్రేటర్ 26వ వార్డు అక్కయ్యపాలెం వద్ద శంకువానిపాలెంలోని వాగ్దేవి, అల్లిపురంలోని నీలమ్మ వేపచెట్టు వద్ద గల ప్రియాంకా విద్యోదయ పాఠశాలల్లోనూ, మురళీనగర్‌లోని పట్టాభిరెడ్డితోట ఎంఎస్ఎం స్కూల్‌లో పూజా మహోత్సవాలు జరిగాయి.

నేడు అప్పన్న సన్నిధిలో సూర్య జయంతి



సూర్యప్రభ వాహనం

సింహాచలం, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): సూర్య జయంతి పురస్కరించుకుని సింహగిరిపై మంగళవారం రథసప్తమి వేడుకలు వైభవంగా నిర్వహించనున్నారు. ఇందుకోసం అధికారులు ఏర్పాట్లు పూర్తిచేశారు. ఏటా మాఘ మాస శుక్లపక్షం నాడు ఆలయంలోని రాతిరథంపై శాస్త్ర విధానంలో రథసప్తమి వేడుకలు జరపడం ఆనవాయితీ. ఉదయం 7 గంటలకు స్వామివారి ఉత్సవ మూర్తి గోవిందరాజస్వామిని ఉభయదేవేరులతో రాతిరథంపై ఉంచి విశేష పూజలు, అభిషేకాలు నిర్వహిస్తారు. తరువాత అదే రథంపై నిత్యం జరగాల్సిన ఆర్జిత నిత్య కల్యాణం చేస్తామని అధికారులు ప్రకటించారు. నృసింహవనంలో సూర్య భగవానుడి విగ్రహం వద్ద ప్రత్యేక అభిషేకాలు, అరుణ హోమం, పారాయణలు, సూర్య నమస్కారాలు వంటి పలు ఆధ్యాత్మిక కార్యక్రమాలు నిర్వహిస్తామని అధికారులు తెలిపారు.

ఉక్కుకు కొరవడిన రక్షణ

... 5వ పేజీ తరువాయి

అవకాశం ఉన్నందున తక్షణ సహాయ చర్యల కోసం ఇక్కడ ఏకంగా ఫైర్ విభాగాన్నే నడుపుతున్నారు. ప్లాంటులో మూడు ఫైర్ స్టేషన్లు, వాటిలో 13 ఫైర్ ఇంజిన్లు (అగ్నిమాపక వాహనాలు), వాటిలో పనిచేయడానికి 282 మంది శాశ్వత సిబ్బంది ఉన్నారు. విశాలంగా విస్తరించిన ప్లాంటులో 2,744 ఫైర్ హైడ్రెంట్లు, 1,071 ఎక్స్‌టర్నల్ ఫైర్ హైడ్రెంట్లు, 86 మానిటరింగ్ కేంద్రాలు, 28 ఫైర్ ఫైటింగ్ పంప్ హౌస్‌లు ఉన్నాయి. ప్రమాదాలు సంభవించినప్పుడు ఒక్కోసారి మంటలను నీటితో కాకుండా ఫోమ్, రసాయనాలను ఉపయోగించి నియంత్రించాల్సి ఉంటుంది. దానికి తగిన ఏర్పాట్లు కూడా ఉన్నాయి. మంటలను అదుపు చేసే కార్బన్ డయాక్సైడ్ వాహనం, ఫోమ్‌తో కూడిన వాహనాలు ఉన్నాయి. ఇవి కాకుండా వివిధ ప్రాంతాల్లో 14 వేల ఫైర్ ఎక్స్‌టింగ్ విషర్లు ఏర్పాటు చేశారు. వీటిని ప్రత్యేక శిక్షణ పొందిన సిబ్బందితో గత నాలుగు దశాబ్దాలుగా నిర్వహిస్తూ వస్తున్నారు. స్టీల్‌ప్లాంటులోనే కాకుండా హెచ్‌పీసీఎల్, పోర్టు, ఫార్మా సిటీ వంటి పరిశ్రమల్లో భారీ ప్రమాదాలు జరిగినప్పుడు స్టీల్ ప్లాంటు ఫైర్ ఇంజన్లు వెళ్లి సహాయ సహకారాలు అందిస్తున్నాయి. అటువంటి ఫైర్ విభాగాన్ని కూడా ప్రైవేటుకు అప్పగించాలని స్టీల్ ప్లాంటు యాజమాన్యం నిర్ణయించింది. తమ దగ్గర అన్ని రకాల ఫైర్ ఫైటింగ్ పరికరాలు ఉన్నాయని, వాటితో ఫైర్ స్టేషన్లు నడపడానికి ఆసక్తి కలిగిన సంస్థలు ముందుకురావాలని డిసెంబరు నెలాఖరులో ఆసక్తి వ్యక్తీకరణ ప్రకటన జారీచేసింది. దీనిపై అప్పుడే అభ్యంతరాలు వ్యక్తమయ్యాయి.

ఉక్కు ఆస్తులు దోచుకోవడానికి కుట్ర

స్టీల్‌ప్లాంటు ఆస్తులను దొడ్డిదారిన దోచుకోవడానికి పెద్దస్థాయిలో కుట్ర జరుగుతోంది. అందుకే సీఐఎస్ఎఫ్ సిబ్బందిని తగ్గించేశారు. వారైతే ప్రాణాలు పణంగా పెట్టి రక్షణ కల్పిస్తారు. అదే ప్రైవేటు సిబ్బంది అయితే డబ్బులకు లొంగిపోతారు. వారికి లంచాలు ఇచ్చి ప్లాంటులో విలువైనవన్నీ వాహనాల్లో బయటకు తరలించుకుపోవచ్చు. దీనిపై కేంద్ర హోం శాఖ విచారణ చేయాలని డిమాండ్ చేస్తున్నాం.

-అయోధ్యరామ్, కన్వీనర్
విశాఖ ఉక్కు పోరాట కమిటీ

గుండె పరీక్షకు గంటల నిరీక్షణ

... 5వ పేజీ తరువాయి

ఎవరైనా నేరుగా కార్డియాలజీ విభాగానికి వచ్చి చూపించుకునేందుకు అవకాశం ఉంది. ఓపీ, ఐపీ (ఇన్‌పేషెంట్) సేవల్లో పెద్దగా ఇబ్బందులు ఉండవు. కానీ, ఈ విభాగంలో చేసే పరీక్షల కోసం మాత్రం రోగులు గంటలు తరబడి నిరీక్షించాల్సి వస్తోంది. సోమవారం 'ఆంధ్రజ్యోతి' ప్రతినిధి కార్డియాలజీ విభాగానికి వెళ్లేసరికి సుమారు 100 మందికిపైగా రోగులు, వారి సహాయకులు 2డీ ఎకో పరీక్ష నిర్వహించే గది వద్ద నిరీక్షిస్తూ కనిపించారు. సుమారు రెండు గంటల నుంచి ఉన్నామని, ఇప్పటికీ పరీక్ష చేయడానికి పిలవలేదని రామమ్మ అనే వృద్ధురాలు వాపోయింది.

టోకెన్లు నుంచి పరీక్ష వరకు..

కార్డియాలజీ విభాగం కింద ఒక గదిలో 2డీ, ట్రెడ్ మిల్ టెస్ట్ చేస్తారు. 2డీ ఎకో పరీక్ష చేయించుకోవాలనుకునే రోగులకు ముందుగా టోకెన్లు జారీచేస్తారు. ఇవి ఉదయం ఎనిమిది గంటలకు కార్డియాలజీ విభాగానికి చెందిన సిబ్బంది పంపిణీ చేస్తారు. ప్రతిరోజూ వంద మందికి ఇస్తారు. అయితే, ఈ టోకెన్‌ల కోసం ఆస్పత్రిలోని వివిధ విభాగాల్లో ఇన్‌పేషెంట్‌లుగా ఉంటూ వైద్య సేవలు పొందుతున్న రోగులు, వారి బంధువులు తెల్లవారుజామున ఐదు గంటల నుంచి క్యూలో ఉంటారు. ఇక ఓపీకి వచ్చే రోగులు రెండు, మూడుసార్లు తిరిగితే గానీ ఈ పరీక్ష చేయించుకోవడం సాధ్యంకాదు. ఇన్‌పేషెంట్లుగా ఉండేవారు కూడా ఉదయం 8 గంటల నుంచి అక్కడకు చేరుకుని వేచి చూస్తుంటారు.

చిన్న గదిలోనే పరీక్షలు

కార్డియాలజీ విభాగంలోని 2డీ ఎకో పరీక్షలు నిర్వహించే గది చిన్నగా ఉంటుంది. ఒక్కోసారి టోకెన్లు తీసుకున్న వారికి పరీక్షలు నిర్వహించని పరిస్థితి ఏర్పడుతుంది. మధ్యాహ్నం రెండు గంటల వరకు మాత్రమే ఈ పరీక్షలు చేస్తారు. ఆ సమయం దాటితే మరుసటిరోజు రావాల్సిందే. 2డీ ఎకో పరీక్ష శనివారం పరీక్ష కాలేదని, అందుకే మళ్లీ సోమవారం రావాల్సి వచ్చిందని రామేశ్వరరావు అనే వ్యక్తి పేర్కొన్నారు.

మూలకు చేరిన ట్రెడ్ మిల్ పరికరం..

గుండె పనితీరును పరీక్షించే వాటిల్లో ట్రెడ్‌మిల్ టెస్ట్ ఒకటి. అయితే, గడిచిన నాలుగు నెలలుగా ఈ విభాగంలో ఉన్న ఏకైక ట్రెడ్ మిల్ పరికరం మూలకు చేరింది. దీంతో రోగులకు ట్రెడ్ మిల్ టెస్ట్ చేసే పరిస్థితి లేకుండా పోయింది. ఈ పరీక్ష అవసరమైన రోగులు బయటకు వెళ్లి చేయించుకోవాల్సిన దుస్థితి ఏర్పడుతోంది. ఈ విభాగ వైద్యులు సమస్యను ఉన్నతాధికారులు దృష్టికి తీసుకుళ్లినా ప్రయోజనం లేకుండా పోయింది.

రోగుల సంఖ్యకు అనుగుణంగా...

కార్డియాలజీ విభాగానికి వస్తున్న రోగుల సంఖ్య పెరుగుతోంది. అయితే, అందుకు అనుగుణంగా ఇక్కడ వైద్య సేవలు అందించాలంటే కొన్ని కీలక నిర్ణయాలు తీసుకోవాల్సిన అవసరం ఉంది. ప్రస్తుతం ఈ విభాగం నడుస్తున్న భవనం అత్యంత పురాతనమైనది. నాడు-నేడులో భాగంగా ఈ భవనాన్ని కూల్చి కొత్తవి నిర్మిస్తారని భావించారు. అయితే, ఇప్పట్లో ఈ పనులు పూర్తయ్యే అవకాశం లేదు. కార్డియాలజీ విభాగానికి ప్రతినెలా మూడు వేల మంది వరకు ఓపీ సేవలకు వస్తుంటారు. రోగుల సంఖ్య పెరిగిన నేపథ్యంలో మెరుగైన వైద్య సేవలు అందించేందుకు అనుగుణంగా విశాలమైన భవనాన్ని కేటాయించాల్సి ఉంది.

గంటలు తరబడి నిరీక్షించడమే ఇబ్బందే

మాది బొబ్బిలి. తీవ్రమైన అనారోగ్య సమస్యతో రాజేంద్ర ప్రసాద్ వార్డులో చేరాను. వైద్యులు 2డీ ఎకో పరీక్ష చేయించుకోవాలని చెప్పారు. ఈ పరీక్ష చేయించుకునేందుకు వస్తే ఇక్కడ పరిస్థితి దారుణంగా ఉంది. ఆక్సిజన్ సహాయంతో వచ్చాను. ఈ పరీక్ష తరువాత స్కానింగ్‌కు వెళ్లాలి. అక్కడ కూడా రోగులు తాకిడి అధికంగా ఉంది. తీవ్రమైన అనారోగ్య సమస్యలతో బాధపడే రోగులకు ఆయా వార్డుల్లోనే అవసరమైన పరీక్షలు చేయించేలా ఏర్పాట్లు చేస్తే బాగుంటుంది.

- అల్లు సింహాచలం, రోగి

రోగులకు ఇబ్బందులు లేకుండా సేవలు

రోగులకు ఇబ్బందులు లేకుండా సేవలు అందిస్తున్నాం. 2డీ ఎకో పరీక్ష ఎక్కువ మందికి చేయించాల్సి వస్తుండడంతో అక్కడ అధిక సంఖ్యలో కనిపిస్తున్నారు. ప్రతిరోజూ వంద నుంచి 120 మందికి పరీక్షలు చేస్తున్నాం. రెండు మెషిన్లు ఉన్నాయి. పిల్లలకు కూడా ప్రత్యేకంగా చేయిస్తున్నాం. ఎక్కువ మంది ఇన్‌పేషెంట్లు వస్తుంటారు. ఎవరికి ఇబ్బందులు లేకుండా పరీక్షలు నిర్వహించేందుకు యత్నిస్తున్నాం. బిల్డింగ్ చిన్నది కావడం వల్ల ఇబ్బంది ఉంది. - డాక్టర్ ఆదిలక్ష్మి, కార్డియాలజీ విభాగాధిపతి

బడ్జెట్‌లో దక్షిణ కోస్తా రైల్వే జోన్‌కు నిధులు

... 5వ పేజీ తరువాయి

డివిజన్ పరిధిలో రైల్వే లైన్లను వంద శాతం ఎలక్ట్రిఫికేషన్ చేశామన్నారు.

కవచ్ శిక్షణ కోసం సిబ్బంది

వాల్తేరు డివిజన్ పరిధిలోను కవచ్ రక్షణ వ్యవస్థ ఏర్పాటు చేస్తున్నారని, దానికి అవసరమైన శిక్షణ కోసం సిబ్బందిని దశల వారీగా సికింద్రాబాద్ పంపుతున్నామని చెప్పారు. మొదటి బృందం శిక్షణకు వెళ్లిందన్నారు. ఈ వ్యవస్థ వల్ల రైళ్లు ఒక ట్రాక్‌పై వచ్చి ఒక దానితో మరొకటి ఢీకొనే అవకాశాలు ఉండవన్నారు. దేశంలో వందే భారత్ రైళ్లకు అనూహ్యమైన స్పందన లభిస్తోందని, విశాఖలో మూడు మార్గాల్లో నాలుగు రైళ్లు నడుపుతున్నామని, సికింద్రాబాద్, భువనేశ్వర్ మార్గాల్లో ఆక్యుపెన్సీ 100 శాతం కంటే అధికంగా ఉందన్నారు. దుర్గ్ వైపు నడుపుతున్న రైలులో పార్వతీపురం, రాయగడ వరకు ఆదరణ బాగుందని, ఆ తరువాత కొంచెం తక్కువగా ఉన్నందున ఇటీవల ఆ రైలులో ఎనిమిది కోచ్‌లు తగ్గించి నడుపుతున్నామని వివరించారు. కొత్తగా మరో 200 వందే భారత్ రైళ్లు తయారవుతున్నాయని, అవి అందుబాటులోకి వస్తే ప్రజలు కోరుకుంటున్న విధంగా విశాఖపట్నం నుంచి తిరుపతికి స్లీపర్ వందేభారత్ వచ్చే అవకాశం ఉందన్నారు.

కొత్తగా నమో భారత్ రైళ్లు కూడా వస్తాయని, ఇవి ఇంటర్ సిటీ ఎక్స్‌ప్రెస్‌లుగా ఉంటాయని, 100 కి.మీ. దూరం ఉన్న సిటీల మధ్య నడుపుతారని, వీటిలో 16 కోచ్‌లు ఉంటాయని ఆయన చెప్పారు. విశాఖపట్నం నుంచి రాజమండ్రి, శ్రీకాకుళం, పార్వతీపురం, విజయనగరం, కాకినాడ వంటి ప్రాంతాలకు వీటిని నడుపుకునే అవకాశం ఉందన్నారు. విశాఖపట్నం-పలాస మధ్య రైల్వే ట్రాక్‌ను గంటకు 130 కి.మీ. వేగంతో రైళ్లు నడిపేలా తీర్చిదిద్దామని డీఆర్ఎం సాహూ వివరించారు. ఈ సందర్భంగా విలేకరులు రాయగడ డివిజన్, వాల్తేరు డివిజన్ సరిహద్దులు నిర్ణయించారా?...అని ప్రశ్నించగా, ఆ విషయాలన్నీ బడ్జెట్ పరిధిలోకి రావని, వాటిపై విధాన నిర్ణయాలు తీసుకోవలసి ఉందన్నారు.

సదాలోచనలతో సమాజ జాగృతి

- జాతీయ అవార్డు రావడం సంతోషం
- హ్యాట్సాఫ్ పోలీస్

లఘు చిత్ర దర్శకుడు జీవీ త్రినాథ్



సిరిపురం, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి) : మంచి ఆలోచనల ద్వారా సమాజాన్ని జాగృతం చేయగలమని, తద్వారా ప్రజలను చైతన్యవంతులను చేసేందుకు దోహదపడుతుందని హ్యాట్సాఫ్ పోలీస్ లఘు చిత్ర దర్శకుడు, రచయిత జీవీ త్రినాథ్ అన్నారు. సాయికర్ణ క్రియేషన్స్ నిర్మాతలు పైడి శంకరరావు, కోరుకొండ లీలా కుమారి ఆయన దర్శకత్వంలో 2021లో నిర్మితమైన హ్యాట్సాఫ్ పోలీస్ ' చిత్రానికి మరో రెండు అంతర్జాతీయ అవార్డులు దక్కాయి. ఈ నేపథ్యంలో ఆయన సోమవారం ఆంధ్రజ్యోతితో అంతర్జాతీయ అవార్డుపై స్పందించి మాట్లాడారు.

ప్రశ్న : ఇప్పటివరకు ఎన్ని లఘు చిత్రాలు నిర్మించారు?

జవాబు : మొత్తం మూడు చిత్రాలు నిర్మించా. అందులో 2021 చివర్లో చిత్రాన్ని ప్రారంభించాం. కొద్ది రోజుల్లోనే చిత్రాన్ని వైజాగ్ పరిసర ప్రాంతాల్లో షూటింగ్ చేసి పూర్తి చేశాం. మొత్తం 43 నిమిషాల నిడివితో లఘు చిత్రం ఉంటుంది.

ప్రశ్న : ఈ చిత్రానికి ఎన్ని అవార్డులు వచ్చాయి?

జవాబు : మొత్తం ఇప్పటి వరకు రాష్ట్రస్థాయిలో ఒకటి , జాతీయ స్థాయిలో రెండు లభించాయి. తాజాగా అంతర్జాతీయ స్థాయిలో అవార్డు లభించడం చాలా ఆనందంగా ఉంది. దీంతో తాను కష్టపడి తీసిన చిత్రానికి మంచి గుర్తింపు లభించడం చాలా ఆనందంగా ఉంది. విశాఖకు చెందిన తనకు మరిన్ని చిత్రాలకు దర్శకత్వం వహించేలా ప్రేరేపించింది.

ప్రశ్న : మొత్తం ఎన్ని చిత్రాలకు దర్శకత్వం వహించారు?

జవాబు : ఇప్పటికి మూడు లఘు చిత్రాలకు దర్శకత్వం వహించాను.తొలి చిత్రం పంచమి కోరిక. .రెండో చిత్రం హ్యాట్సాఫ్, మూడో చిత్రం జగపతిగారి మనవరాలు ఉన్నాయి.

ప్రశ్న : చిత్రానికి అవార్డులు రావడానికి ముఖ్య అంశం..

జవాబు : చిత్రానికి ప్రధానంగా కథే ముఖ్య అంశం. సమాజంలో పోలీసు అంటే ఒక రకమైన భావన ఉంది. అలా కాకుండా అనుకోని సంఘటనలో బాలుడికి జైలు శిక్ష పడుతుంది. అసలు ఎందుకు జైలుశిక్ష పడుతుందన్న విషయాన్ని పూర్తిగా స్టడీ చేయడానికి నిస్వార్థంగా పోలీసు దృష్టిపెట్టే కోణం చిత్రానికి ప్రధానాంశంగా ఉంటోంది. సత్యాన్ని నిలబెట్టేందుకు పోలీసు ఏతరహా నిర్ణయాలు తీసుకుంటాడో.. లోతుగా కేసును ఏ విధంగా దర్యాప్తు చేసి న్యాయంవైపు పోరాడుతూ బాలుడిని రక్షిస్తాడో అన్నదే మూలకథ.

సినిమా గైడ్

● **మదగజరాజ :** జగదాంబ, సంగం, కామేశ్వరి, వెంకటేశ్వర-1, ఊర్వశి (కంచరపాలెం), సౌజన్య (గోపాలపట్నం), మోహిని (గాజువాక), అన్నపూర్ణ (కూర్మన్నపాలెం),

● **మహిష :** రమాదేవి

● **సంక్రాంతికి వస్తున్నాం :** శ్రీలీలామహల్, శారద, శ్రీరామ, మెలోడి, జగదాంబ, కిన్నెర, గోకుల్, కాంతి, శ్రీలక్ష్మీనరసింహ-1,2 (104 ఏరియా), శ్రీనరసింహ (గోపాలపట్నం), శ్రీకన్య (గాజువాక), లిఖిత (శ్రీహరిపురం), అరుణ (పెదగంట్యాడ), తాతా, రాములమ్మ (తగరపువలస)

● **డాకు మహారాజ్ :** శ్రీవెంకటేశ్వర, శరత్, శ్రీకన్య, కిన్నెర, శ్రీలక్ష్మీనరసింహ-1 (104 ఏరియా), సుకన్య, మోహిని కాంప్లెక్స్, శ్రీకన్య హెవెన్ (గాజువాక), నటరాజ్-1 (పెందుర్తి), గణేష్, సప్తగిరి (తగరపువలస)

● **గేమ్ ఛేంజర్ :** మెలోడి, సంగం, కామేశ్వరి, గోకుల్, శ్రీలక్ష్మీనరసింహ-2 (104 ఏరియా), నరసింహ (గోపాలపట్నం),కన్యకాంప్లెక్స్, మోహిని కాంప్లెక్స్ (గాజువాక), లిఖిత (శ్రీహరిపురం), సీతారామయ్య (పరవాడ), నటరాజ్-2 (పెందుర్తి) రాములమ్మ (తగరపువలస)

రైతు బజార్‌లో ధరలు (కిలో)

ఉల్లిపాయలు 29, టమాటా 12, వంకాయలు (తెలుపు)22, వంకాయలు (నలుపు) 26, బెండకాయలు 46, పచ్చిమిర్చి 34, కాకరకాయలు 42, బీరకాయలు 50, ఆనపకాయ 12, కాలీఫ్లవర్ 12, క్యాబేజి 10, క్యారెట్ 22 దొండకాయలు 34, బంగాళ దుంపలు 16, అరటికాయ (పె)7, మునక్కాడలు (కిలో) 100, అల్లం (పాతది)44, బరబాటి 34, ముల్లంగి 24, నిమ్మకాయలు (కిలో) 62, బద్దచిక్కుడు 24, దోస కాయలు 26, వెల్లుల్లి (పెద్దవి) 240, కొబ్బరికాయ (పెద్దది) 25, బీన్స్ (పెన్సిల్) 44, కీరదోస 32, కాప్సికమ్ 40, పొట్లకాయ (పెద్దది) 28, చేమదుంపలు 38 చిలగడదుంపలు 36, కంద 56, దేముడు చిక్కుడు 28, గోరు చిక్కుడు 26, కూర పెండలం 26, బ్రకోలి 55 , నూల్‌కోల్ 30, పనసపొట్టు 200, కొండఉసిరి 60, కరివేపాకు (కిలో) 60, కొత్తిమీర (పెద్దకట్ట) 25, పుదీన (కట్ట) 5, చుక్కకూర (కట్ట) 4, పాల కూర (కట్ట) 4, తోటకూర (కట్ట) 4, మామిడికాయలు 120, బూడిద గుమ్మడి కాయ 30, కర్రపెండలం 18, మామిడి అల్లం 46, బొప్పాయి 38, జామకాయలు (కిలో) 60.

కోడిగుడ్లు (నెక్)

(వంద - రూ.లలో)

విశాఖపట్నం	490
విజయనగరం	494
శ్రీకాకుళం	494

చికెన్ ధరలు

బ్యాగ్	
రైతు ధర	100
లైవ్ ధర	120
విత్ స్కిన్	210
స్కిన్‌లెస్	220



16వ వార్డు హెచ్‌బీ కాలనీలో రోడ్డు పక్కన ఆక్రమిత స్థలంలో ఉన్న దుకాణాలు



ఆరిలోవలో ఫుట్‌పాత్‌లపై ఉన్న బడ్డీలు

ప్రభుత్వం మారినా.. ఆక్రమణలు తొలగలేదు

- జీవీఎంసీ టౌన్ ప్లానింగ్ అధికారులను వీడని వైసీపీ గాలి
- 16వ వార్డులో కొనసాగుతున్న కబ్జాలు

వెంకోజీపాలెం, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి) : వైసీపీ పాలన మారి కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి సుమారు ఏడు నెలలు కావస్తోంది. కానీ జీవీఎంసీ టౌన్ ప్లానింగ్ అధికారులు ఇంకా ఆ పార్టీ నాయకుల సేవలోనే పరితపిస్తున్నారు. టౌన్ ప్లానింగ్, విద్యుత్ శాఖ అధికారులను ఆ పార్టీ గాలి ఇంకా వీడలేదన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. 16వ వార్డులోని హెచ్‌బీ కాలనీ సులభ్‌కాంప్లెక్సు వద్ద రోడ్డును ఆక్రమించి ఏర్పాటు చేసిన బడ్డీల తొలగింపులో అధికారుల వైఖరే ఇందుకు నిదర్శనం. రోడ్డు పక్కన చిన్న తోపుడు బండి ఏర్పాటు చేస్తే వెంటనే తొలగించే జీవీఎంసీ టౌన్ ప్లానింగ్ అధికారులు ఇక్కడ పదుల సంఖ్యలో బడ్డీలు ఆక్రమించి ఏర్పాటు చేయడమే కాకుండా.. అక్రమంగా అద్దెలు,దందాలు నిర్వహిస్తున్నా, పట్టించుకోకపోవడం అధికారుల నిర్లక్ష్య వైఖరిని స్పష్టం చేస్తుందని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఎప్పటి నుంచో నిరుపయోగంగా ఉన్న స్టీల్‌ప్లాంట్ భూములను ఇటీవల ఆక్షన్ వేసి విక్రయించారు. స్థలం కొనుగోలు చేసుకున్న లబ్ధిదారులు వాటికి ఆనుకుని ఆక్రమించి ఉన్న బడ్డీలను తొలగించాలని స్టీల్‌ప్లాంట్ వారికి విన్నవించడంతో స్టీల్‌ప్లాంట్ యాజమాన్యం ఈ బడ్డీలను ఖాళీ చేయాలని నోటీసులు కూడా జారీ చేసింది. అదే క్రమంలో విద్యుత్ శాఖ వారికి కూడా లేఖను ఇచ్చారు. కానీ టౌన్‌ప్లానింగ్ అధికారులు వలే విద్యుత్ శాఖ అధికారులు కూడా నిర్లక్ష్యాన్ని ప్రదర్శిస్తున్నారని, నోటీసు ఇచ్చి సుమారు 5 నెలలు దాటినా ఇప్పటి వరకు బడ్డీలకు విద్యుత్ సరఫరాను నిలిపివేయాలని, అందుకనే బడ్డీలను తొలగించలేకపోతున్నామని, స్టీల్‌ప్లాంట్ సెక్యూరిటీ (డిప్యూటేషన్ పోలీసు సిబ్బంది) చెబుతున్నారు. అయితే బడ్డీలను తొలగించమని ఎవరైనా ఫిర్యాదు చేస్తే ఆ విషయంపై బడ్డీల వద్దకు వెళ్లి ఈ సెక్యూరిటీ సిబ్బంది కొందరు బెదిరించి డబ్బులు వసూలు చేస్తున్నారన్న ఆరోపణలు కూడా వినిపిస్తున్నాయి. ఇప్పటికైనా ఉన్నతాధికారులు దీనిపై దృష్టి సారించి అని విభాగాల అధికారులు తగిన చర్యలు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.

ఆరిలోవ : జీవీఎంసీ 12వ వార్డు సర్వీసు రోడ్డులో ఉన్న సంతపాలెంలో ఫుట్‌పాత్ ఆక్రమణకు గురైంది. ఫుట్‌పాత్ పరిధిలో చాలాచోట్ల దుకాణాలు ఏర్పాటు చేయడంతో పాదచారులు రాకపోకలకు ఇబ్బంది పడుతున్నారు. ముఖ్యంగా ఈ మార్గంలో ప్రతిరోజూ మార్నింగ్, ఈవినింగ్ వాకింగ్ చేసే వం దలాది మంది అవస్థలు పడుతున్నారు. ఆక్రమణలపై స్థానికులు జీవీఎంసీ అధికారుల దృష్టికి తీసుకువెళ్లినా.. ఎవరూ పట్టించుకోవడం లేదు.



వెంకోజీపాలెం : జీవీఎంసీ ప్రాథమిక పాఠశాలలో పూజ చేస్తున్న ఉపాధ్యాయులు, విద్యార్థులు

పాఠశాలల్లో వసంత పంచమి పూజలు

వెంకోజీపాలెం, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): వసంత పంచమిని పురస్కరించుకుని పలు పాఠశాలల్లో సోమవారం విద్యార్థులు సరస్వతి దేవికి పూజలు చేశారు. వేద మంత్రాలతో సరస్వతి దేవికి అభిషేకాలు జరిపారు. ఇసుకతోటలోని చైతన్య టెక్నో, హెచ్‌బీకాలనీలోని శారదా విద్యానిలయంలో విద్యార్థులతో పూజలు చేయించారు. నూతన విద్యార్థులకు ప్రవేశ రుసుము లేకుండా రాయితీ కల్పించారు. శ్రీ చైతన్య టెక్నో ప్రిన్సిపాల్ ఎస్.రమణి, శారదా విద్యా నిలయం కరస్పాండెంట్ శ్రీనివాసరావు, ఇన్‌చార్జి త్రినాథరావు పాల్గొన్నారు.

జీవీఎంసీ ప్రాథమిక పాఠశాలలో..

పాతవెంకోజీపాలెం జీవీఎంసీ ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులు, ఉపాధ్యాయులు పూజలు నిర్వహించారు. స్కూల్ ప్రిన్సిపాల్ సీహెచ్. జ్యోతి పాఠశాల ఆవరణలో ఉన్న సరస్వతి దేవి విగ్రహానికి పూజలు చేయించారు. చిన్నారులందరికీ సరస్వతి కటాక్షం కలగాలని ఆశీర్వదించారు.

ఆరిలోవ : ఆరిలోవలోని పలు ఆలయాలు, వివిధ పాఠశాలల్లో చిన్నారులకు అక్షరాభ్యాస పూజలు చేయించారు. చినగదిలిలోని లలితా దేవి ఆలయంలో సరస్వతి దేవికి పసుపు కుంకాలతో పూజలు చేశారు. అనంతరం సామూహిక అక్షరాభ్యాసం జరిగింది. ఈ కార్యక్రమంలో ఆలయ ధర్మకర్త వెంకటప్పారావు చిన్నారులకు పలక బలపాలు అందించారు. చినగదిలి సంతపాలెం, పెదగదిలి, తోటగరువు మండల పరిషత్తు ప్రాథమిక పాఠశాలల్లో అక్షరాభ్యాసాలు చేయించారు.



పీతలవానిపాలెం గెడ్డలో పూడికలు

పూడికలతో నిండిపోయిన గెడ్డలు

మద్దిలపాలెం, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి) : జీవీఎంసీ 22వ వార్డులోని పలు గెడ్డలు పూడికలతో నిండిపోయాయి. గెడ్డల చుట్టు పక్కల ఉంటున్న నివాసితులు దుర్వాసనకు నరకయాతన అనుభవిస్తున్నారు. నెలలు తరబడి పూడికలు తొలగించకపోవడంతో పరిసరాలు కూడా అధ్వానంగా మారుతున్నాయి. మద్దిలపాలెం బస్టాప్ వెనుక నుంచి పిఠాపురం కాలనీ ముత్తూట్ ఫైనాన్స్ భవనం మీదుగా ప్రవహించే గెడ్డలో పాలిథిన్ కవర్లు గుట్టలుగా పేరుకుపోయాయి. దీంతో మురుగు నీరు నిల్వ ఉండడం వల్ల దోమలు స్వైరవిహారం చేస్తున్నాయి. కాయగూరల మార్కెట్ గెడ్డ పక్కన ఉండడంతో మార్కెట్‌లోని చెత్తను గెడ్డలో వేస్తున్నారు. జీవీఎంసీ సిబ్బంది ఎప్పటికప్పుడు చెత్త తొలగించకపోవడంతో గెడ్డ వ్యర్థాలతో నిండిపోతోంది. పీతలవానిపాలెం మీదుగా ప్రవహించే గెడ్డ మరింత దారుణంగా ఉంది.ఈ గెడ్డలో టన్నులు కొద్ది పూడిక పేరుకుపోయింది. ఎక్కడికక్కడ వ్యర్థాలు ఉండడంతో మురుగు నీటి ప్రవహానికి అడ్డంగా మారి దుర్వాసన వెదజల్లుతోంది. పీతలవానిపాలెంలో డస్ట్‌బిన్ లేకపోవడంతో పారిశుధ్య కార్మికులు ఉదయం వచ్చి చెత్త సేకరిస్తుంటారు.రాత్రి సమయంలో ఇళ్లల్లోని చెత్తను స్థానికులు గెడ్డలో పాడేస్తున్నారు. భవన నిర్మాణ వ్యర్థాలను కూడా గెడ్డలో పడేస్తున్నారు. దాదాపు ఆరు నెలలుగా గెడ్డల్లో పూడికలు తీయకపోవడంతో పరిసరాలు కంపుకొడుతున్నాయి.జీవీఎంసీ అధికారులు స్పందించి పూడికలు తొలగింపునకు చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.



పిఠాపురం కాలనీ గెడ్డలో వ్యర్థాలు

పారా అథ్లెటిక్స్‌లో వైద్య విద్యార్థికి పతకం



ఆధావన్‌కు ప్రశంసాపత్రం అందిస్తున్న ఏఎంసీ ప్రిన్సిపాల్ బుచ్చిరాజు

విశాఖపట్నం స్పోర్ట్సు, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): పారా అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్ టోర్నీలో ఆంధ్ర వైద్య కళాశాల విద్యార్థి (2కె 24 బ్యాచ్) కె. ఆధావన్ పతకం సాధించాడు. మంగళగిరిలో జరిగిన ఏడవ రాష్ట్రస్థాయి పారా అథ్లెటిక్స్ మీట్ షాట్‌పుట్ ఈవెంట్‌లో ఆధావన్ ప్రతిభ కనబరిచి కాంస్య పతకం సాధించాడు. ఈ సందర్భంగా ఆంధ్ర వైద్య కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ జి. బుచ్చిరాజు సోమవారం తన కార్యాలయంలో ఆధావన్‌ను అభినందించి రూ.5 వేల నగదు ప్రోత్సాహాన్ని అందించారు. జాతీయ టోర్నీలలో రాణించాలని ఆకాంక్షించారు.కార్యక్రమంలో ఆంధ్ర వైద్య కళాశాల స్పోర్ట్సు వైస్ ప్రెసిడెంట్ డాక్టర్ ఆర్.సునీల్‌కుమార్, ఫిజికల్ డైరెక్టర్ డాక్టర్ పాత్రుడు, పారా స్పోర్ట్సు రాష్ట్ర కార్యదర్శి రామస్వామి పాల్గొన్నారు.

వీధుల్లో కుక్కల స్వైరవిహారం

- గుంపులుగా సంచారం
- కనిపించిన వారిపై దాడులు
- భయాందోళనలో వాహనదారులు

వెంకోజీపాలెం, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి) : గ్రేటర్ పరిధిలోని 15వ వార్డు జేఆర్ నగర్ కాలనీలో ఊర కుక్కలు స్వైరవిహారం చేస్తున్నాయి. రోడ్లు, ఖాళీ స్థలాల్లో గుంపు గుంపులుగా సంచరిస్తూ ప్రజలను భయాందోళనకు గురిచేస్తున్నాయి. దీంతో కాలనీవాసులు రోడ్ల మీద తిరగాలన్నా, ఖాళీ స్థలాల్లో కూర్చోవాలన్నా వెనకడుగు వేస్తున్నారు. కొన్నిచోట్ల కుక్క పిల్లలు రోడ్లపై సంచరిస్తూ వాహనాల రాకపోకలకు ఇబ్బంది కలిగిస్తున్నాయి. కుక్కలు అధికంగా ఉండడంతో రోడ్లపైకి రావాలంటే పిల్లలు, వృద్ధులు జంకుతున్నారు. గుంపులుగా తిరుగుతున్న కుక్కలు ఎక్కడ దాడి చేస్తాయోనన్న భయం వారిని వెంటాడుతోంది. రాత్రివేళ ఇంటి నుంచి బయటకు రావాలంటే భయంగా ఉంటోందని స్థానికులు వాపోతున్నారు. రాత్రి అయితే చాలు కుక్కలు పెద్దగా అరుస్తూ రోడ్లపై పరుగులు తీస్తుంటాయని, ఆ సమయంలో ఎవరు ఎదురుపడినా మూకుమ్మడిగా దాడి చేసి గాయపరుస్తున్నాయని వాపోతున్నారు. కొన్నిసార్లు ద్విచక్ర వాహనదారులను వెంబడిస్తున్నాయని, దీంతో పలువురు ప్రమాదాలకు గురవుతున్నారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దీనిపై ఎన్ని ఫిర్యాదులు చేసినా జీవీఎంసీ అధికారులు స్పందించడం లేదని ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా కుక్కల నియంత్రణకు చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.



15వ వార్డులోని ప్రధాన రహదారిలో కుక్కలు



ఆరిలోవ కొత్త పోలీసుస్టేషన్ ఎదుట కుక్కల గుంపు

ఆరిలోవ : విమ్స్ ఆస్పత్రి ప్రాంగణంలో నిర్మించిన ఆరిలోవ కొత్త పోలీసుస్టేషన్ ఎదుట కుక్కల గుంపుతో ప్రజలు భయపడుతున్నారు. ఆ మార్గంలో వెళ్లేవారు అప్రమత్తంగా ఉండాలని, చేతిలో ఓ కర్ర పట్టుకుంటే శునకాలు దాడిచేసే అవకాశం ఉండదని స్థానికులు సూచిస్తున్నారు.

నేడు అప్పన్న సన్నిధిలో సూర్య జయంతి

సింహాచలం, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): సింహగిరిపై సూర్య జయంతి పురస్కరించుకుని మంగళవారం రథసప్తమి వేడుకలు వైభవంగా నిర్వహించనున్నారు. ఈమేరకు అధికారులు ఏర్పాట్లు పూర్తిచేశారు. ఏటా మాఘ మాస శుక్లపక్షం నాడు ఆలయంలోని రాతి రథంపై శాస్త్ర విధానంలో రథసప్తమి వేడుకలు జరపడం ఆనవాయితీ. ఈ మేరకు ఉదయం 7 గంటలకు స్వామివారి ఉత్సవమూర్తి గోవిందరాజస్వామిని ఉభయదేవేరులతో రాతి రథంపై ఉంచి విశేష పూజలు, అభిషేకాలు నిర్వహించనున్నారు. తరువాత అదే రథంపై నిత్యం జరగాల్సిన ఆర్జిత నిత్య కల్యాణం చేస్తారు. అలాగే నృసింహవనంలోని సూర్య భగవానుడి విగ్రహం వద్ద ప్రత్యేక అభిషేకాలు, అరుణ హోమం, పారాయణలు నిర్వహించనున్నారు.



ముగిసిన బాస్కెట్‌బాల్ చాంపియన్‌షిప్ టోర్నీ



విజేతలతో అతిథులు

విశాఖపట్నం స్పోర్ట్సు, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి) : ఏయూ గోల్డెన్ జూబ్లీ గ్రౌండ్‌లో జరిగిన జాతీయ క్రీడాకారుడు తరుణ్ స్మారక జిల్లాస్థాయి బాస్కెట్‌బాల్ టోర్నీలో ట్రూ బాలర్స్ జట్టు ట్రోఫీని కైవసం చేసుకోగా, పోలీసు బ్యారక్ జట్టు రన్నరప్‌గా నిలిచింది. సోమవారం రాత్రి ఏయూ బాస్కెట్‌బాల్ గ్రౌండ్‌లో జరిగిన ముగింపు కార్యక్రమానికి జనసేన నాయకుడు ముక్కా శ్రీనివాసరావు, గీతం వర్సిటీ కార్యదర్శి భరద్వాజ్ ముఖ్య అతిథులుగా హాజరై విజేతలకు ట్రోఫీలు అందజేశారు. ఈ కార్యక్రమంలో శ్రీవాణి వేబ్రిడ్జి డైరెక్టర్లు పి. అప్పారావు, పిల్లా సతీష్, జిల్లా బాస్కెట్‌బాల్ సంఘం అధ్యక్షుడు సునీల్ మహంతి, కార్యదర్శి భూషణరావు, ఇతర ప్రతినిధులు పాల్గొన్నారు.

శ్రేయా కేన్సర్ ఫౌండేషన్ ఉచిత స్ర్కీనింగ్ శిబిరాలు



ఆస్పత్రి ఎండీ మురళీకృష్ణ

విశాఖపట్నం, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి) : కేన్సర్ వ్యాధి పట్ల ప్రజల్లో అవగాహన కల్పించేందుకు ఏటా శ్రేయా ఫౌండేషన్‌తో కలిపి మహాత్మా గాంధీ కేన్సర్ ఆస్పత్రి అవగాహన కార్యక్రమాలు నిర్వహించడంతోపాటు ఉచిత కేన్సర్ స్ర్కీనింగ్ శిబిరాలు ఏర్పాటు చేస్తున్నామని ఆస్పత్రి ఎండీ డాక్టర్ వి.మురళీకృష్ణ తెలిపారు. ఆస్పత్రి ఆవరణలో సోమవారం ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడుతూ ఉత్తరాంధ్రలోని అనేక ప్రాంతాల్లో క్యాంపులు నిర్వహించి ప్రాథమిక దశలోనే కేన్సర్లను గుర్తించి, వారికి సకాలంలో వైద్య సేవలు అందించామన్నారు. కేన్సర్ రోగులకు అత్యుత్తమ వైద్య సేవలను అందిస్తున్నామని, ప్రజల్లో అవగాహన కల్పిస్తున్నామని, ఇందుకుగాను అనేక అవార్డులను తీసుకున్నట్టు వివరించారు. కేన్సర్‌కు కారణమవుతున్న గుట్కా, మద్యం, ఖైనీ వంటి పదార్థాలకు దూరంగా ఉండాలని, నిత్యం వ్యాయామం, సమతుల ఆహారం, ఆరోగ్యకరమైన జీవన విధానాలను అలవాటు చేసుకోవాలన్నారు. హెపటైటిస్ బి, హెచ్‌పీవీ వంటి వ్యాక్సిన్లను సిఫార్సుల మేరకు తీసుకోవడం ముఖ్యమన్నారు. ఆస్పత్రిలో రోగులకు అత్యాధునిక వైద్య సేవలను అందిస్తూ కోలుకునేలా చేస్తున్నామని వివరించారు. రోబోటిక్ సర్జరీలు, త్రీడీ మామోగ్రఫీ, అడాప్టివ్ రేడియో థెరపీ, లీనియర్ యాక్సిలిరేటర్ రేడియేషన్ వంటి సేవలను అందిస్తున్నట్టు వెల్లడించారు.

రాష్ట్రానికి కంస మామలా జగన్

వీఎంఆర్డీఏ చైర్మన్ ప్రణవ్‌గోపాల్

సిరిపురం, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్రానికి కంస మామలా జగన్ చేసిన పాపాలు విద్యార్థుల పాలిట శాపంగా మారాయని వీఎంఆర్డీఏ చైర్మన్ ప్రణవ్‌గోపాల్ వ్యాఖ్యానించారు. మాజీ సీఎం జగన్, అతని తండ్రి వైఎస్సార్ పేరు చెప్పుకొని గద్దెనెక్కి బోధనా రుసుములు చెల్లింపు అటకెక్కించిన ఘనుడు అని ఎద్దేవా చేశారు. ఇప్పుడు ఫీజుపోరు అంటూ కొత్త నాటకాలు, పగటి వేషాలు వేస్తే జనం చూస్తూ ఊరుకోరని తెలిపారు. ఇప్పటికి 11తో సరిపెట్టారని, ఇక మిగిలింది సున్నానే అన్నారు. విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ బాధ్యతలు తీసుకున్న వెంటనే సుమారు రూ.800 కోట్లు బోధనా రుసుములు కోసమే కేటాయించారని తెలిపారు. అది కూడా తెలియకుండా పోరు-హోరు అంటే జనం చూస్తూ ఊరుకోరు.. జాగ్రత్త జగన్ అంటూ హెచ్చరించారు. జగన్‌పై ఉన్న కేసులు విచారణ చేయాలంటూ ఆంధ్ర ప్రజలు పోరుబాట పట్టే రోజు తొందరలోనే ఉందని గుర్తు చేశారు.

ప్రమాదకరంగా విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు

ఆరిలోవ, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి) : చినగదిలి, రామలక్ష్మణ పురం, శ్రీకృష్ణ యువజన సేవా సంఘం పరిధిలో, పెదగదిలి జంక్షన్‌లో విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు ప్రమాదకరంగా ఉన్నా యి. ఎటువంటి రక్షణ కంచె లేకుండా కేవలం అడుగు ఎత్తులో వీటిని ఏర్పాటు చేయడంతో ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని పలు వురు భయాందోళన చెందుతున్నారు. కొన్ని సార్లు ట్రాన్స్‌ఫార్మర్ల నుంచి నిప్పులు రాలు తుండడంతో ఆందోళన చెందుతున్నారు. అధి కారులు తక్షణమే స్పందించి ట్రాన్స్‌ఫార్మర్ల చుట్టూ రక్షణ చర్యలు చేపట్టడంతో పాటు ఎత్తు పెంచాలని స్థానికులు కోరుతున్నారు.

పాఠశాల భవనం ప్రారంభం



భవనం ప్రారంభోత్సవంలో పాల్గొన్న అధికారులు, దాతలు

ఆనందపురం, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని గంభీరం గ్రామంలో స్వచ్ఛంద సంస్థల సహకారంతో నిర్మించిన ప్రభుత్వ పాఠశాల భవనాన్ని సోమవారం ప్రారంభించారు. విశాఖపట్నం రౌండ్ టేబుల్ స్వచ్ఛంద సంస్థ మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో నాలుగు గదుల భవనం రూ. 50 లక్షలతో నిర్మించింది. ఈ సందర్భంగా రౌండ్ టేబుల్ సంస్థ సభ్యుడు వెంకటేశ్వర్లు మాట్లాడుతూ నూతనంగా నిర్మించిన భవనంలో ఎక్కువ మంది విద్యార్థులు చదువుకునేలా చూడాలని ఉపాధ్యాయులను కోరారు. కార్యక్రమంలో ఎంపీడీవో జానకి, ఎంఈఓలు జోగీందర్‌నాథ్, గంగరాజు, పాఠశాల హెచ్‌ఎం ప్రసాద్, భవన నిర్మాణ దాతలు కేశవ మజ్జి, అనికేత వర్మ, మురళీ పాల్గొన్నారు.

కల్యాణ మండపాల వేలాన్ని రద్దు చేయాలి



రిలే దీక్షల్లో పాల్గొన్న జేఏసీ నేత పూడిపెద్ది శర్మ, తదితరులు

సింహాచలం, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి) : సింహాచలం దేవస్థానం పరిధిలో జరిగే వివాహ శుభ కార్యాలకు దేవస్థానం మండపాలను ఉచితంగా ఇవ్వాలని సనాతన హిందూ ధర్మ పరిరక్షణ సమితి జేఏసీ కన్వీనర్ పూడిపెద్ది శర్మ డిమాండ్ చేశారు. మండపాల వేలం రద్దు చేయాలని కోరుతూ కొండదిగువ తొలిపావంచా వద్ద విశ్వహిందూ పరిషత్, విరాట్ సంఘ్, వివేకానంద యువ సంస్థాన్, నరసింహ సేన సంయుక్తంగా చేపట్టిన రిలే దీక్షలను సోమవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వేలం నిర్వహించక ముందు ఎందరో భక్తులు సింహగిరిపై వివాహాలను రూ.15 వేలతో జరిపేవారని, గత మూడేళ్లుగా దేవస్థానం అధికారులు మండపాలకు వేలం నిర్వహించడంతో ఆ ఖర్చు విపరీతంగా పెరిగిపోయిందన్నారు. ఆలయాలు వ్యాపార కేంద్రాలు కాదని, ఆధ్యాత్మిక కేంద్రాలు అన్న విషయాన్ని అధికారులు గుర్తించాలని చెప్పారు. గత నెలాఖరుతో దేవస్థానం పరిధిలో కల్యాణ మండపాలు, షామియానాలను వేలం ద్వారా దక్కించుకున్న వ్యక్తి గడువు ముగిసినా.. అధికారులకు ఎందుకు ఇవ్వడం లేదని ప్రశ్నించారు. కాంట్రాక్టర్ నుంచి వాటిని స్వాధీనం చేసుకోవడంతో పాటు వేలాన్ని పూర్తిగా రద్దు చేసే వరకు దీక్షలు కొనసాగిస్తామన్నారు.

హిందీ ప్రాంతీయులకు తెలుగు సాహితీ ఔన్నత్యం

విశాఖపట్నం, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): స్థానిక సెయింట్ జోసెఫ్ మహిళా కళాశాలలో భాషా విభాగాల ఆధ్వర్యంలో సోమవారం భారత ప్రభుత్వ విద్యా మంత్రిత్వ శాఖ కేంద్రీయ హిందీ సంస్థాన్ (ఆగ్రా) సౌజన్యంతో 'తెలుగు జ్ఞానపీఠ పురస్కార గ్రహీతల సాహితీ కృషి' అన్న అంశంపై రెండు రోజుల జాతీయ సదస్సు ప్రారంభమైంది. ముఖ్యఅతిథులుగా హాజరైన నాగార్జున యూనివర్సిటీ పూర్వకులపతి ఆచార్య వి.బాలమోహన్‌దాస్, సెంట్రల్ హిందీ ఇన్‌స్టిట్యూట్ డైరెక్టర్ సునీల్ కులకర్ణి, ప్రాంతీయ డైరెక్టర్ ఆచార్య గంగాధర్ వనోడే, హైదరాబాద్ హిందీ మహా విద్యాలయ ప్రొఫెసర్ ఆర్.సుమలతలు జ్యోతి ప్రజ్వలన చేశారు. తెలుగు సాహితీ ఔన్నత్యాన్ని హిందీ వారికి అందించే ప్రయత్నంగా కళాశాలలో ఈ సదస్సు నిర్వహించడం గర్వకారణమని కో-ఆర్డినేటర్ డాక్టర్ పి.కె.జయలక్ష్మి పేర్కొన్నారు. అనంతరం ఆమె రచించిన అభినందన గ్రంథాన్ని అతిథులు ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డా.సిస్టర్ షైజీ, డాక్టర్ నిర్మల, డాక్టర్ ఎస్.దీప్తి, డా.కోటేశ్వరరావు, డాక్టర్ భాస్కర సుధ పాల్గొన్నారు.



సదస్సులో మాట్లాడుతున్న బాలమోహన్ దాస్

ఐదెకరాల స్థలంలో అధునాతన పార్కుకు సన్నాహాలు

» డిజిటల్ సర్వే చేసిన జీవీఎంసీ సిబ్బంది

» 'ఆంధ్రజ్యోతి అక్షరం అండగా.. పరిష్కారమే అజెండాగా' కార్యక్రమానికి స్పందన

గాజువాక, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యలను పరిష్కరించడంలో భాగంగా అటు ప్రజలకు, ఇటు అధికారులకు వారధిగా నిలిచి 'అక్షరం అండగా.. పరిష్కారమే అజెండాగా' పేరిట 'ఆంధ్రజ్యోతి' నిర్వహించిన చర్చా వేదిక కార్యక్రమంలో వెలుగుచూసిన సమస్యలు పరిష్కారం దిశగా అడుగులు వేస్తున్నాయి. గత నెల 28న 87వ వార్డు పరిధి తిరుమలనగర్‌లో 'ఆంధ్రజ్యోతి' నిర్వహించిన కార్యక్రమంలో ప్రజలు నేరుగా పలు సమస్యలను అధికారుల దృష్టికి తీసుకువెళ్లిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో 86, 87 వార్డుల ప్రజలకు పార్కు అందుబాటులో లేకపోవడంతో సిద్ధార్థనగర్‌లో నిరుపయోగంగా ఉన్న సుమారు ఐదెకరాల ప్రభుత్వ స్థలంలో పార్కును ఏర్పాటు చేయాలని పలువురు విజ్ఞప్తి చేశారు. అన్ని వయసుల వారికి ఉపయుక్తంగా ఉండేలా అధునాతనమైన పార్కును నిర్మించాలని వేదికపై ప్రజల తరఫున 87వ వార్డు కార్పొరేటర్ బొండా జగన్ కూడా అధికారుల దృష్టికి తెచ్చారు. ఈ మేరకు సోమవారం జీవీఎంసీ అధికారులు ఆ స్థలంలో డిజిటల్ సర్వే చేశారు. ఈ సర్వే ఆధారంగా ప్రభుత్వ స్థలం ఎంత ఉంది, ఆక్రమణకు ఎంత గురైందన్న అంశాలపై నివేదిక రూపొందించి ఉన్నతాధికారులకు అందజేస్తారు. దీనికి ఆమోదం లభించాక ఈ స్థలం చుట్టూ ప్రహరీ నిర్మించి అధునాతనమైన పార్కును ఏర్పాటు చేసేందుకు తగిన చర్యలు చేపడతామని అధికారులు, కార్పొరేటర్ బొండా జగన్ తెలిపారు.

సమస్యకు పరిష్కారం లభించడం ఆనందంగా ఉంది

- బొండా జగన్, 87వ వార్డు కార్పొరేటర్

'అక్షరం అండగా.. పరిష్కారమే అజెండాగా' పేరిట 'ఆంధ్రజ్యోతి' నిర్వహించిన చర్చా వేదికలో ప్రజలు వెలుగులోకి తెచ్చిన సమస్యపై అధికారులు సత్వరమే స్పందించడం ఎంతో ఆనందంగా ఉంది. ఈ నేపథ్యంలోనే సిద్ధార్థనగర్‌లో ఖాళీగా ఉన్న స్థలంలో జీవీఎంసీ అధికారులు డిజిటల్ సర్వే చేపట్టారు. ఇక్కడ పార్కు నిర్మాణానికి తొలి అడుగు పడడం హర్షణీయం.




సిద్ధార్థనగర్‌లోని ప్రభుత్వ స్థలంలో డిజిటల్ సర్వే చేస్తున్న సిబ్బంది

కబళిస్తున్న కేన్సర్

ఉత్తరాంధ్ర పరిధిలో ఏటా 20వేల కొత్త కేసులు

» కేజీహెచ్‌లోనే ఎనిమిది వేలకుపైగా గుర్తింపు

» అవగాహనతోనే వ్యాధిని ఎదుర్కొనే అవకాశం

» నగరంలో పదికిపైగా ఆస్పత్రుల్లో వైద్య సేవలు

» నేడు ప్రపంచ కేన్సర్ డే

విశాఖపట్నం, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి):

కేన్సర్ మహమ్మారి ఎన్నో కుటుంబాలను కబళిస్తోంది. ఉత్తరాంధ్ర జిల్లాల పరిధిలో ప్రతి ఏటా సుమారు 20 వేల కొత్త కేసులు నమోదుకావడం పరిస్థితికి అద్దంపడుతోంది. వీరిలో 60 నుంచి 70 శాతం మంది వ్యాధి మూడు, నాలుగు స్టేజిలకు చేరాక ఆస్పత్రులను ఆశ్రయిస్తుండడంతో ఇబ్బందులు ఎదురవుతున్నాయని వైద్య నిపుణులు చెబుతున్నారు. నగరంలో కేజీహెచ్ సహా మరో పదికిపైగా ఆస్పత్రుల్లో కేన్సర్ బాధితులకు వైద్యసేవలు అందిస్తున్నారు. వ్యాధి పట్ల అవగాహన లేక, సకాలంలో గుర్తించడం లేదు. దీనిపై అవగాహన కల్పించే ఉద్దేశంతో ఏటా ఫిబ్రవరి నాలుగో తేదీన ప్రపంచ కేన్సర్ డేగా పరిగణిస్తున్నారు. ఈ ఏడాది యునైటెడ్ బై యునిక్ థీమ్‌తో దీనిని నిర్వహిస్తున్నారు.

ఉత్తరాంధ్రలో ఎక్కువగా పురుషుల్లో నోటి, లంగ్, జీర్ణాశయం, పెద్ద పేగు, ప్రొస్టేట్ కేన్సర్లు కనిపిస్తున్నాయి. మహిళల్లో రొమ్ము, గర్భ సంచి ముఖద్వార, నోటి, అండాశయ, స్టమక్ కేన్సర్లు కనిపిస్తున్నాయి. చిన్నారుల్లో బ్రెయిన్, బ్లడ్ కేన్సర్లు వెలుగుచూస్తున్నాయి. గతంతో పోలిస్తే రొమ్ము కేన్సర్లు అధికమవుతున్నాయి. ప్రతి వంద కేసుల్లో 30 రొమ్ము కేన్సర్లు ఉండగా, 25 నుంచి 30 వరకు గ్యాస్ట్రో ఇంటస్టైనల్ (పెద్ద పేగు, స్టమక్, లివర్, ప్రాంకియాస్) కేసులు ఉంటున్నాయి. ఆ తరువాతి స్థానంలో గర్భాశయ ముఖద్వార, బ్లడ్ కేన్సర్లు, నోటి కేన్సర్లు ఉన్నాయి. చిన్నారుల్లో వచ్చే బ్లడ్, బ్రెయిన్ కేన్సర్లు పది వరకు నమోదవుతున్నాయి. గతంలో కేన్సర్ బారినపడిన వారిలో 50 నుంచి 60 ఏళ్లు దాటిన వారు ఉండగా, ప్రస్తుతం అప్పుడే పుట్టిన చిన్నారి నుంచి 80 ఏళ్ల వృద్ధుడి వరకు కనిపిస్తోందని నిపుణులు చెబుతున్నారు.


కేజీహెచ్ కేన్సర్ విభాగంలోని ఐసీయూ వార్డు

కోలుకుంటున్న వారి సంఖ్యా ఎక్కువే..

కేన్సర్ బాధితులకు మెరుగైన వైద్యసేవలు అందిస్తుండడంతో కోలుకుంటున్న వారి సంఖ్య కూడా పెరుగుతోంది. ఏటా 25 వేల నుంచి 30 వేల మంది వ్యాధి నుంచి కోలుకుంటున్నట్టు గణాంకాలు చెబుతున్నాయి. అధునాతన వైద్య పద్ధతుల సాయంతో నాలుగో స్టేజ్‌లో వ్యాధిని గుర్తించిన వారికి కూడా మెరుగైన వైద్య సేవలు అందించడం ద్వారా జీవితకాలాన్ని పెంచగలుగుతున్నారు. కేన్సర్ బారిన పడుతున్న వారిలో 51 శాతం మంది మహిళలు, 49 మంది పురుషులు ఉంటున్నారు. రోబోటిక్ సర్జరీ, బోన్‌మ్యారో ట్రాన్స్‌ప్లాంటేషన్, రేడియో థెరపీ, అడాప్టివ్ రేడియో థెరపీ, ఇమ్యునో థెరపీ వంటి పద్ధతుల్లో చికిత్స అందిస్తున్నారు.

అవగాహనతోనే దూరం

జీవన విధానంలో మార్పులు, కలుషిత ఆహారం తీసుకోవడం, పొగాకు ఉత్పత్తులు, మద్యం తదితరాలు కేన్సర్ కారకాలు. కేన్సర్ పట్ల అవగాహన ఉండి, 40 ఏళ్లు దాటిన ప్రతి ఒక్కరూ నిర్ధారణ పరీక్షలు చేయించుకోవడం ద్వారా ముందుగా వ్యాధిని గుర్తించి మెరుగైన వైద్య సేవలు అందుకోవచ్చు. కొన్ని రకాల వ్యాక్సిన్లు కూడా అందుబాటులో ఉన్నాయి.


కేన్సర్‌కు అడ్వాన్స్‌డ్ వైద్య సేవలందించే లీనియర్ యాక్సిలరేటర్ మెషీన్‌తో రేడియేషన్ అంకాలజీ హెచ్‌వోడీ డాక్టర్ పాండురంగకుమారి

ఇవీ గణాంకాలు..

గత ఏడాది కేజీహెచ్‌లోని మెడికల్ అంకాలజీలో 4,959 మంది కేన్సర్ రోగులను పరీక్షించి, 3,384 మందిని ఇన్‌పేషెంట్లుగా చేరి వైద్యం అందించారు. వీరిలో 5,072 కీమో థెరపీలను ఇచ్చారు. సర్జికల్ అంకాలజీలో 148 మంది ఓపీలో సేవలందించగా, 165 మందిని ఇన్‌పేషెంట్లుగా చేర్చుకుని చికిత్స చేశారు. 149 మందికి మేజర్, 103 మందికి మైనర్ సర్జరీలు నిర్వహించారు. రేడియేషన్ అంకాలజీ విభాగంలో నిర్వహించిన ఓపీలో 3,067 మందికి వైద్య సేవలు అందించారు. 1,192 మందిని ఇన్‌పేషెంట్లుగా చేర్చుకున్నారు. 922 మందికి మేజర్ రేడియేషన్, మరో 528 మందికి మైనర్ రేడియేషన్ చేశారు.

పెరుగుతున్న కేన్సర్ కేసులు



గత ఐదు, పదేళ్లతో పోలిస్తే కేన్సర్ కేసులు మూడు నుంచి ఐదు రెట్లు పెరిగాయి. వ్యాధి పట్ల అవగాహన లేకపోవడంతో మూడు, నాలుగు స్టేజుల్లో వస్తున్నారు. దీని వల్ల మెరుగైన వైద్య సేవలందించేందుకు ఇబ్బందులు ఎదురవుతున్నాయి. ప్రస్తుతం కీమో థెరపీ, టార్గెటెడ్ థెరపీ, ఇమ్యూనో థెరపీతో రోగులు కోలుకునేలా చేస్తున్నాం. మెడికల్ అంకాలజీ ఓపీలో ప్రతినెలా కొత్తగా 40 కేసులు గుర్తిస్తున్నాం. కేన్సర్లకు ఇదీ కారణమని చెప్పలేం. జీవన విధానంలో మార్పులు, కలుషిత ఆహారం తీసుకోవడం కూడా కారణాలే. అరకు, పాడేరు, చింతపల్లి నుంచి కొన్నిరకాల ట్యూమర్స్‌తో కూడిన కేన్సర్ కేసులు చూస్తున్నాం. 120 రకాల కీమోథెరపీ, మందులు ఇస్తున్నాం. వేగంగా వ్యాధిని గుర్తించడం ద్వారా మంచి ఫలితాలను రాబట్టగలం.

- డాక్టర్ కె.శిల్ప, మెడికల్ అంకాలజీ విభాగాధిపతి, కేజీహెచ్

పూర్తిగా కోలుకున్నా



మాది మాడుగుల. ఆరు నెలల కిందట ఆయాసం, లేవడానికి శక్తి లేని పరిస్థితి. కేజీహెచ్‌లో చూపిస్తే లింఫోమో కేన్సర్ అని చెప్పారు. మొదట్లో భయమేసింది. వైద్యులు ధైర్యం చెప్పారు. కోలుకుంటున్నావని భరోసా కల్పించారు. వైద్యులు చెప్పినట్టుగానే ఆరు నెలల వైద్యం తరువాత పూర్తిగా కోలుకున్నా. ఇప్పుడు ఫాలోఅప్ ట్రీట్‌మెంట్‌కు వస్తు న్నా. కేన్సర్ తగ్గిపోయిందని వైద్యులు చెప్పారు. ప్రతి మూడు నెలలకు ఒకసారి చెకప్‌కు వస్తున్నాను. ప్రస్తుతం నా ఆరోగ్యం చాలా బాగుంది.

- పి.అశ్విని, వ్యాధిని జయించిన మహిళ

క్రైం... crime news

ఆటో ఢీకొని ద్విచక్ర వాహనదారుడి మృతి

ఎండాడ, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): ఆటో ఢీ కొనడంతో ద్విచక్ర వాహనదారుడు మృతి చెందాడు. ఈ సంఘటన పీఎంపాలెం పోలీస్ స్టేషన్ పరిధిలో సోమవారం జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు... బాపట్ల జిల్లా కొల్లూరి మండలం జువ్వలపాలేనికి చెందిన కంచర్ల యేసుబాబు (25) విజయవాడలోని టెన్నిస్ కోర్టులో పనిచేస్తూ జీవించేవాడు. సుమారు 20 రోజుల కిందట మధురవాడ సాయిప్రియ గార్డెన్స్‌లో ఉన్న మైల్‌స్టోన్ టెన్నిస్ కోర్టులో చేరాడు. ఇతడు సోమవారం కారుషెడ్డు కూడలి నుంచి సర్వీసు రోడ్డులో పీఎం పాలెం వైపు వస్తుండగా మితిమీరిన వేగంతో వచ్చిన ఆటో బలంగా ఢీకొనడంతో తీవ్రంగా గాయపడ్డాడు. వెంటనే స్థానికులు స్పందించి అతడిని ఇక్కడికి సమీపంలోని గీతం ఆస్పత్రికి తరలించగా, అక్కడ చికిత్స పొందుతూ మృతిచెందాడు. మృతుడి కుటుంబసభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు పీఎంపాలెం పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.

భార్య కాపురానికి రాలేదని ఆత్మహత్య


ఉమ్మిడి నరేంద్ర(ఫైల్)

భీమునిపట్నం, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): భార్య కాపురానికి రావడం లేదని తీవ్ర మనస్తాపానికి గురైన భర్త ఫ్యాన్‌కు ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. నాలుగో వార్డు కొత్తూరు గ్రామానికి చెందిన ఉమ్మిడి నరేంద్ర (31) క్రేన్ ఆపరేటర్. అతనికి గత ఏడాది ఏప్రిల్ 21న తాటితూరుకి చెందిన కొమర లక్ష్మితో వివాహం జరిగింది. మూడు నెలలుగా వారి మధ్య మనస్పర్థలు, గొడవలతో భార్య పుట్టింటికి వెళ్లిపోయింది. నరేంద్ర, అతని తల్లిదండ్రులు, గ్రామ పెద్దలు పలుమార్లు తాటితూరు వెళ్లి రావాలని కోరినా ఆమె వినలేదు. ఈ నేపథ్యంలో అతని తల్లిదండ్రులు సత్తియ్య, సింహాచలం ఆదివారం కూలి పనులకు వెళ్లిపోగా ఇంట్లోని ఫ్యాన్‌కు ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడి తల్లి సింహాచలం ఫిర్యాదు ఫిర్యాదు మేరకు హెచ్‌సీ ప్రసాద్ కేసు దర్యాప్తు చేస్తున్నారు.

గుండెపోటుతో ఉపాధి కూలి మృతి

పద్మనాభం, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రేవిడి పంచాయతీ రౌతులపాలెంలో ఉపాధి కూలి గుండెపోటుతో మృతి చెందాడు. సారిక గురువులు (65) సోమవారం ఉపాధి పనికి వెళ్లాడు. తుప్పలు తొలగిస్తుండగా ఒక్కసారిగా కుప్పకూలి మృతి చెందాడు. గుండెపోటుతో మృతి చెంది ఉంటాడని అధికారులు భావిస్తున్నారు. ఘటనా స్థలాన్ని ఎంపీడీఓ విజయకుమార్, ఏపీఓ వరలక్ష్మి, వీఆర్వో సందర్శించి మృతుడి వివరాలు సేకరించారు. శవ పంచనామా అనంతరం మృతదేహాన్ని బంధువులకు అప్పగించారు. ప్రభుత్వం నుంచి ఆర్థిక సాయం అందేలా చూస్తామని ఎంపీడీఓ చెప్పారు.

బాలికపై లైంగిక దాడి : పోక్సో కేసు నమోదు

ఎంవీపీ కాలనీ, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): ఎంవీపీ పోలీస్ స్టేషన్ పరిధిలో బాలిక (11)పై లైంగిక దాడికి పాల్పడిన వ్యక్తిపై పోక్సో కేసు నమోదైంది. హెచ్‌బీ కాలనీ ప్రాంతానికి చెందిన బాలిక నీళ్ల సీసా కోసం సమీపంలో ఉంటున్న గణేష్ ఇంటికి రావడంతో అతడు ఆమెపై లైంగిక దాడికి పాల్పడ్డాడు. బాలిక తండ్రి ఫిర్యాదు చేయడంతో సీఐ మురళి నిందితుడ్ని అదుపులోకి తీసుకుని, కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నారు.

పాఠశాల కమిటీలతో చర్చించే నిర్ణయం: డీఈవో

విశాఖపట్నం, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): పాఠశాలల పునర్వ్యవస్థీకరణకు ప్రక్రియ ఇంకా ప్రాథమిక దశలోనే ఉందని జిల్లా విద్యాశాఖాధికారి ఎన్.ప్రేమ్‌కుమార్ అన్నారు. 'ప్రభుత్వ బడికి మంగళం' శీర్షికన సోమవారం 'ఆంధ్రజ్యోతి'లో ప్రచురితమైన కథనానికి ఆయన స్పందించారు. పాఠశాలల పునర్వ్యవస్థీకరణకు ముందు జీవో 117 రద్దునకు సంబంధించి ఇచ్చిన సూచనల మేరకు ప్రతి గ్రామ పంచాయతీ యూనిట్‌గా తీసుకుంటామన్నారు. అయితే పాఠశాల యాజమాన్య కమిటీలతో చర్చించి విద్యార్థుల భవిష్యత్తును పరిగణనలో తీసుకుని అభ్యసనా సామర్థ్యాలు పెంపొందించేలా పాఠశాలల పునర్వ్యవస్థీకరణ జరుగుతుందని పేర్కొన్నారు.

రేపటి నుంచి తెలుగు సినిమా ఫెస్టివల్

డాబాగార్డెన్స్, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): వైజాగ్ ఫిల్మ్ సొసైటీ ఆధ్వర్యంలో ఈ నెల 5వ తేదీ నుంచి మూడు రోజుల పాటు తెలుగు సినిమా ఫెస్టివల్ నిర్వహిస్తున్నట్టు కార్యదర్శి నరవ ప్రకాశరావు తెలిపారు. విశాఖ పౌరగ్రంథాలయంలో ప్రతి రోజు సాయంత్రం 5.30 గంటలకు చిత్ర ప్రదర్శనలుంటాయన్నారు. 5న రైతుబిడ్డ, 6న ఒక ఊరి కథ, 7న నా ఆటోగ్రాఫ్ చిత్రాలను ఉచితంగా ప్రదర్శించడం జరుగుతుందని, నగరంలోని సినీప్రియులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

వివిధ కోర్సుల్లో శిక్షణకు దరఖాస్తుల ఆహ్వానం

మల్కాపురం, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ ఇన్ మారిటైమ్ అండ్ షిప్ బిల్డింగ్ (సీఈఎంఎస్) పలు కోర్సులలో ఉచిత శిక్షణ ఇవ్వనుంది. ఈ మేరకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నామని సీఈఎంఎస్ కమాండోర్ చీఫ్ ఆపరేటింగ్ ఆఫీసర్ గోపాల్‌కృష్ణ తెలిపారు. విశాఖపట్నం పోర్టు అథారిటీ (వీపీఏ) సహకారంతో అందించే శిక్షణకు 27 సంవత్సరాలలోపు వయసు కలిగిన అభ్యర్థులు పదో తరగతి, ఇంటర్, ఏదైనా డిగ్రీ, ఐటీఐ, ఫిట్టర్, వెల్డర్, ఎలక్ట్రీషియన్, డిప్లొమా/ఇంజనీరింగ్ మెకానికల్, ఎలక్ట్రికల్‌లో ఉత్తీర్ణులు అర్హులన్నారు. కొరియర్ సూపర్‌వైజర్, వేర్‌హౌస్ ఎగ్జిక్యూటివ్, పిక్కర్ ఇన్వెంటరీ కంట్రోలర్, సీఎన్‌సీ ఆపరేటర్, సీఎన్‌సీ ప్రోగ్రామర్, ఎలక్ట్రీషియన్, వెల్డర్, ప్రొడక్ట్ డిజైన్ ఇంజనీర్ కోర్సులలో ఉచిత శిక్షణ, ఉపాధి కల్పిస్తామన్నారు. అల్లూరి సీతారామరాజు జిల్లా నిరుద్యోగ యువత కూడా ఈ అవకాశాన్ని వినియోగించుకోవచ్చునని తెలిపారు. ఆసక్తి కలిగిన వారు సింధియా జంక్షన్ సమీపంలోని సీఈఎంఎస్ కేంద్రంలో గానీ, 8688411100, 8331901237, 0891-2704010 నంబర్లలో సంప్రదించి, ఈనెల పదో తేదీలోగా తమ పేర్లను రిజిస్టర్ చేసుకోవాలన్నారు.

తరగతి గదిలో దుర్వాసన: 11 మంది విద్యార్థులకు అస్వస్థత

» గోపాలపట్నం ప్రభుత్వ ఆస్పత్రికి తరలింపు

» పద్మనాభనగర్ జడ్పీ హైస్కూల్‌లో సంఘటన

గోపాలపట్నం, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): తరగతి గదిలో భరించలేని దుర్వాసన వెలువడడంతో 11 మంది విద్యార్థులు అస్వస్థతకు గురయ్యారు. ఈ సంఘటన గ్రేటర్ 92వ వార్డు పద్మనాభనగర్ (హెచ్‌సీ వెంకటాపురం) జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సోమవారం జరిగింది. పాఠశాలలోని 8వ తరగతి గదిలో శనివారం ఉదయం దుర్వాసన వచ్చింది. దీంతో ఇద్దరు విద్యార్థులు వాంతులు చేసుకున్నారు. విషయం తెలుసుకున్న హెచ్‌ఎం అప్పారావు వెంటనే వారిని మరో గదిలోకి పంపించి, ఆ గదిని శుభ్రం చేయించారు. అయితే సోమవారం ఉదయం అదే గదిలో తరగతులు నిర్వహించారు. ఉదయం 11.30 గంటల సమయంలో మళ్లీ దుర్వాసన రావడంతో విద్యార్థులు జి.త్రిష, ఎం.రాజేష్, ఎం.హామిని, నారాయణ కౌశిక్, ఎన్.తేజస్వరూప్, వి.యశ్వంత్, పి.వైష్ణవి. జె.దివ్య, ఎ.సౌమ్య, పూజ, ఉష వాంతులు చేసుకున్నారు. వారిని హెచ్‌ఎం అప్పారావు వెంటనే గోపాలపట్నం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. వైద్య బృందం వారిని సాయంత్రం వరకు ఆస్పత్రిలోనే ఉంచి వైద్య సేవలు అందించారు. విద్యార్థులు అస్వస్థతకు గురైన విషయం తెలుసుకున్న గోపాలపట్నం తహసీల్దార్ సీహెచ్‌వీ రమేశ్, ఎంఈవోలు సోమేశ్వరావు, దివాకర్, జిల్లా వైద్యాధికారి డాక్టర్ జగదీశ్ ఆస్పత్రికి చేరుకుని, వారిని పరామర్శించి ఘటనపై ఆరాతీశారు. తరగతి గదిలో కుళ్లిన కోడిగుడ్లు ఉంచడంతోనే దుర్వాసన వెలువడినట్టు విద్యార్థులు చెబుతున్నారు. అస్వసత్థకు గురైన వారి ఆరోగ్యం నిలకడగా ఉండడంతో రాత్రి 7 గంటలకు వారిని ఇళ్లకు పంపించారు.


విద్యార్థుల నుంచి వివరాలు తెలుసుకుంటున్న అధికారులు

గత ప్రభుత్వంలో అంతా అధికార దుర్వినియోగమే

» పార్లమెంటులో విశాఖపట్నం ఎంపీ శ్రీభరత్


సభలో మాట్లాడుతున్న ఎంపీ శ్రీభరత్

విశాఖపట్నం, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని గత ప్రభుత్వం అధికారాన్ని ఎలా దుర్వినియోగం చేయవచ్చునో నిరూపించిందని, ఇప్పుడు అదే అధికారంతో ప్రజలకు ఎంత మేలు చేయవచ్చునో ఎన్‌డీఏ కూటమి ప్రభుత్వం చేసి చూపిస్తున్నదని ఎంపీ శ్రీభరత్ అన్నారు. పార్లమెంటులో రాష్ట్రపతి ప్రసంగానికి ప్రతిస్పందనగా ఆయన ఏపీలో రాజకీయ వాతావరణాన్ని సోమవారం వివరించారు. ప్రజాస్వామ్యంలో అధికారాన్ని ప్రజలే నిర్ణయించాలి గానీ భయపెట్టే ప్రభుత్వాలు కావన్నారు. గత ఐదేళ్లలో జరిగిన పరిణామాలను క్షుణ్ణంగా సభకు వివరించారు. నాడు చంద్రబాబు నాయుడును అరెస్టు చేయడం వల్ల ప్రజాస్వామ్య చైతన్యానికి పునాది పడిందన్నారు. 2020 నుంచి 2023 వరకు ప్రభుత్వ పాలనతో ప్రజలు భయభ్రాంతులకు గురయ్యారన్నారు. ప్రతి చర్యకు ప్రతి చర్య ఉంటుందనేలా 2023- 24 మధ్య రాజకీయ పరిస్థితులు మారిపోయాయన్నారు. మోసపూరిత పాలన కలకాలం ఉండదని, అందరినీ ఎల్లకాలం మోసం చేయడం సాధ్యం కాదని ప్రజలు గొప్ప తీర్పు ఇచ్చారన్నారు. ప్రజాస్వామ్య పరిరక్షణ, న్యాయ పరిపాలన, ప్రజావిశ్వాసాన్ని పెంపొందించేలా ప్రభుత్వ వ్యవస్థలు పనిచేయాలని శ్రీభరత్ ఆకాంక్షించారు.

ఇగ్నో అడ్మిషన్ల గడువు పెంపు

ఎంవీపీ కాలనీ, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): ఇందిరాగాంధీ జాతీయ సార్వత్రిక విశ్వవిద్యాలయం(ఇగ్నో) 2025 ఏడాదికి వివిధ దూరవిద్యా కోర్సులతో పాటు ఆన్‌లైన్ కోర్సుల్లో ప్రవేశాల కోసం గడువును ఈ నెల 15 వరకూ పొడిగించినట్టు సీనియర్ ప్రాంతీయ సంచాలకులు తెలిపారు. అన్ని సర్టిఫికెట్లు, డిప్లొమో, డిగ్రీ, పీజీ కోర్సులకూ ఈ గడువు వర్తిస్తుందన్నారు. ఆన్‌లైన్‌లో అడ్మిషన్లు పొందాలని, ఫీజులు చెల్లించాల్సి ఉంటుందని తెలిపారు. ఎంపిక చేసిన కోర్సుల్లో ఎస్సీ, ఎస్టీ విద్యార్థులకు పూర్తి ఫీజు రాయితీ ఉంటుందన్నారు. వివరాలకు ఇగ్నో వెబ్‌సైట్ లేదా ప్రాంతీయ కేంద్రాల్లో సంప్రతించాలన్నారు.